



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును

భూమి ప్లాట్ నిర్వహణ - అమ్మకం, అద్దె, కొనుగోలు లేదా పెట్టుబడి కోసం నివాస ప్రాంతంలో భవన నిర్మాణం మరియు గృహ ఉపవిభాగానికి అందుబాటులో ఉన్న ఖాళీ పొడి నేల భూమి ప్లాట్‌తో రియల్ ఎస్టేట్ భావన.




కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 142 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 13 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-




### యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో

# మేం పనిచేస్తున్నాం..

- యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం
- ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది
- విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99 పైసలకు భూములు కేటాయించాం
- ఐదు కంపెనీల ద్వారా 65వేల మందికి ఉద్యోగాల కల్పన
- భూముల కేటాయింపుల్లో మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు
- పరిశ్రమలకు 99 పైసలకే భూ కేటాయింపులపై ప్రశ్నోత్తరాల సమయంలో మండలిలో వాడీవేడి చర్చ
- వైసీపీ సభ్యుల ఆరోపణలకు ధీటుగా సమాధానం ఇచ్చిన మంత్రి లోకేష్ ● మండలి నుంచి వైసీపీ సభ్యుల వాకౌట్

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం. ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది. విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99 పైసలకు భూములు కేటాయించాం. ఐదు కంపెనీల ద్వారా 65వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. భూముల కేటాయింపుల్లో మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు. విమర్శించాలనుకుంటే కప్ టీ గురించి నన్ను విమర్శించవచ్చు. ఒక కప్పు కాఫీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకుని ఉంటే నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా సిద్ధమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పరిశ్రమలకు 99 పైసలకే భూ కేటాయింపులపై ప్రశ్నోత్తరాల సమయంలో మండలిలో వాడీవేడి చర్చ జరిగింది. వైసీపీ సభ్యుల ఆరోపణలకు మంత్రి ధీటుగా సమాధానం ఇచ్చారు. గత 20 నెలల కాలంలో పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ఇతర సంస్థలకు 99 పైసలకు కేటాయించిన భూముల వివరాలు, కుదుర్చుకున్న ఎంవోయూలు, పరిశ్రమల వారీగా భూముల కేటాయింపులు, ధరల వివరాలపై శాసనమండలిలో వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, డా.పండుల రవీంద్రబాబు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 5 కంపెనీలకు 99 పైసలకు భూమి కేటాయించాం. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు 99 పైసలకే మొత్తం భూములు కేటాయించాం. ఏయే కంపెనీ ఎన్ని ఉద్యోగాలు కల్పించనుందో కూడా ప్రభుత్వ సమాధానంలో పొందుపర్చాం. కాగ్నిజెంట్ కు భూమి కేటాయించినప్పుడు 8వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. కానీ భూమిపూజ సమయంలో 25వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడం జరిగింది. ఎనర్జీ, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఐఎన్ఐ, ఐటీ అండ్ కామర్స్, ఏపీసీఆర్డీయే, మిగతా .. 2లో..

### అమెరికాలో మృతి చెందిన కర్నూలు యువతి కుటుంబానికి

# రూ.262 కోట్ల పరిహారం

- 29 మిలియన్ డాలర్ల పరిహారం ఇచ్చేందుకు సియాటెల్ ఒప్పందం
- 2023 జనవరి 23న రోడ్డు దాటుతుండగా పోలీసు వాహనం ఢీకొని జాహ్నవి మృతి
- సియాటెల్ సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ ప్రకటన విడుదల




**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలో పోలీస్ అధికారి నిర్లక్ష్యంతో మృతి చెందిన కర్నూలు అమ్మాయి జాహ్నవి కందుల(23) కుటుంబానికి 29 మిలియన్ డాలర్లు భారీ పరిహారాన్ని ఇచ్చేందుకు సియాటెల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇది మన భారత కరెన్సీలో సుమారు రూ.262 కోట్లు. 2023 జనవరి 23న సియాటెల్‌లో రోడ్డు దాటుతున్న జాహ్నవిని పోలీస్ పెట్రోలింగ్ కారు ఢీకొట్టడంతో ఆమె మృతి చెందారు. ఈ మేరకు సియాటెల్ సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ ప్రకటన విడుదల చేశారు. జాహ్నవి కందుల మృతి చాలా బాధాకరమని, ఈ పరిహారంతో ఆమె కుటుంబానికి కాస్తయినా ఉపశమనం లభిస్తుందని తన ప్రకటనలో పేర్కొన్నారు. అయితే దీనిపై జాహ్నవి కుటుంబం నుంచి స్పందన రావాల్సి ఉంది. ఈ కేసులో పరిహార ఒప్పందం కోసం ఇరుపక్షాలు గత వారం కోర్టులో మిగతా .. 2లో..

### రష్యా చమురును

# భారత్ కొనబోదన్నది ట్రంప్ ఒక్కరే

- మోదీ సహా భారతీయ నేతలెవరూ ఆ మాట చెప్పలేదు
- పార్లమెంటులో రష్యా విదేశాంగ మంత్రి లవ్రోవ్ వ్యాఖ్యలు



**మాస్కో, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాతో వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేయనుందంటూ వార్తలొస్తున్న వేళ.. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ తమ దేశ పార్లమెంటులో కీలక వ్యాఖ్యలు చేశారు. మాస్కో నుంచి చమురు కొనుగోలును మిగతా .. 2లో..

### మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్..

# 12వేల మంది పోలీసులతో భద్రత : డీజీపీ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కోసం 12వేల మంది పోలీసులతో భారీ భద్రత ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియకు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేశామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 123 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతను ఏర్పాటు చేసినట్లు డీజీపీ పేర్కొన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ కోసం 12 వేల మంది పోలీసు బలగాలతో పాటు సాయుధ బలగాలు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ నిరంతరం పహారా కాస్తాయని, అదనపు భద్రత కోసం ప్రతి కౌంటింగ్ కేంద్రాన్ని మిగతా .. 2లో..

### శాసనమండలిలో వైసీపీ వైఖరిపై

# మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు


- పరిశ్రమల విషయంలో ద్వంద్వ వైఖరి అంటూ ఆగ్రహం
- గణాంకాలతో సమాధానం ఇస్తున్నా గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపణ
- పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని స్పష్టం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ శాసనమండలిని శాసించాలని చూడటం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. గురువారం మండలిలో రాష్ట్ర అభివృద్ధిపై జరిగిన చర్చలో మాట్లాడుతూ, పరిశ్రమల ఏర్పాటుపై వైసీపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయిన వైసీపీ నేతలు, ఇప్పుడు కూటమి ప్రభుత్వం పరిశ్రమలు తీసుకొస్తుంటే బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. పరిశ్రమలకు భూములు కేటాయించకపోతే కంపెనీలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. మంత్రి నారా లోకేశ్ గణాంకాలతో సమాధానం ఇస్తుంటే వినే ఓపిక లేక వైసీపీ సభ్యులు సభలో గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. దేశానికి వస్తున్న ప్రతి వంద రూపాయల పెట్టుబడిలో 26 రూపాయలు ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని అచ్చెన్నాయుడు తెలిపారు. ఇది కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్ర యువతకు ఉద్యోగాలు రావాలన్నా పరిశ్రమల స్థాపన అత్యవసరమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం అభివృద్ధిని అడ్డుకోవాలని ప్రయత్నిస్తే భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వైసీపీ నేతలను ఆయన హెచ్చరించారు.

### సంక్రాంతి లక్కీడ్రా కేసు

# అంబటికి 14 రోజుల రిమాండ్




**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** సంక్రాంతి సంబరాల లక్కీడ్రా కేసులో వైకాపా నేత అంబటి రాంబాబుకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ గుంటూరు ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. వైకాపా హయాంలో మంత్రి హోదాలో సత్తెనపల్లి నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాల పేరిట సాగించిన అక్రమ వసూళ్లపై నమోదైన కేసులో గుంటూరు ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.కుముదిని బుధవారం పీటీ వారంట్ జారీ చేశారు. ఈ నెల 18లోగా కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. దీంతో ఇవాళ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి గుంటూరు కోర్టులో హాజరు పర్చారు. కేసు వివరాలు మిగతా .. 2లో..

### 3వ తరగతి నుంచే విద్యార్థులకు

# ఏఐ యాక్సెస్

### కేంద్ర విద్యాశాఖ మంత్రిధర్మేంద్ర ప్రధాన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో లానే విద్యారంగం లోను కృత్రిమ మేధ (ఏఐ) విస్తరిస్తుంది. ఈ కొత్త ఏఐ విధానాన్ని భారత్‌లోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి నుంచి అధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు ఈ కృత్రిమ మేధ అందుబాటులో ఉంటుందన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఏఐ కాంక్లేవ్-2026 సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ మేధో సామర్థ్యానికి లోటు లేదని, కృత్రిమ మిగతా .. 2లో..

### కుమార్తెనే కిమ్

# వారసురాలు..

### దక్షిణ కొరియా



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ కుమార్తెనే ఆయన వారసురాలని దక్షిణ కొరియా నిఘా సంస్థ 'నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్' అంచనా వేసింది. ఈ విషయాన్ని చట్టసభ సభ్యుల దృష్టికి తీసుకెళ్లింది. కిమ్ జు యే భవిష్యత్తు నాయకురాలిగా నియామకానికి చేరువలో ఉన్నట్లు తెలిపింది. ఈ నెలాఖరులో అతిపెద్ద రాజకీయ సదస్సును నిర్వహించేందుకు ఉత్తర కొరియా సన్నాహాలు చేస్తున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. కిమ్ తన కుమార్తె కిమ్ జు యేను మొదటిసారిగా మిగతా .. 2లో..

### తెదేపా ఎమ్మెల్యే కొలికపూడికి పల్లా శ్రీనివాస్

# తీవ్ర హెచ్చరికలు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్‌తో తెదేపారాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమావేశమయ్యారు. అసెంబ్లీ లాబీలో కొలికపూడితో ఆయన మాట్లాడారు. కొలికపూడి వ్యవహార శైలిపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాలుగా ఆయనకు పల్లా తీవ్ర హెచ్చరికలు చేశారు. పార్టీ లేకపోతే వ్యక్తిగతంగా జీరో అనే విషయాన్ని గుర్తించి ప్రవర్తించాలని హితవు పలికారు. పార్టీ క్రమశిక్షణ దాటి ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకునేందుకు సీఎం సిద్ధంగా లేరన్నారు. ఎన్నిసార్లు మందలించినా పద్ధతి మార్చుకోకుండా తప్పుల మీద తప్పులు చేస్తే పార్టీ.. ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని పల్లా శ్రీనివాస్ స్పష్టం చేశారు. వాట్సప్‌లో మిగతా .. 2లో..

### 18 లక్షల మెట్రిక్ టన్నుల

# అదనపు ధాన్యం తీసుకోండి

### కేంద్రాన్ని కోరిన సీఎం రేవంత్



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** 2025-26 సీజన్‌లో వానాకాలం పంటకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా సేకరించిన 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ఆహారం, ప్రజాపంపిణీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీని కోరారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖమంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు.. కేంద్రమంత్రిని కలిసి విజ్ఞప్తిచేశారు. "వానాకాలం పంటకు సంబంధించి కేంద్రం 53.73 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణకు మాత్రమే అనుమతి ఇచ్చింది. కానీ రాష్ట్రంలో భారీగా పంట దిగుబడులు రావడంతో మిగతా .. 2లో..

### అమర్‌నాథ్ యాత్రికులకు

# బీమా రూ.10 లక్షలకు పెంపు



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమర్‌నాథ్ యాత్రకు సంబంధించి ఆలయ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. రిజిస్టర్ చేసుకున్న యాత్రికులతోపాటు పూజారులు, అధికారులు తదితరుల ప్రమాద బీమా కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. ఈ ఏడాది యాత్రకు సంబంధించి తొలి పూజను జూన్ 29 జ్యేష్ఠ పౌర్ణమి రోజున నిర్వహించనున్నట్లు శ్రీఅమర్‌నాథ్ ఆలయ బోర్డు (ఎస్ఏఎస్‌బీ) ప్రకటించింది. యాత్ర అధికారిక ప్రారంభ తేదీని త్వరలో ఖరారు చేయనున్నట్లు తెలిపింది. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆధ్వర్యంలో బోర్డు గురువారం సమావేశమైంది. యాత్రికుల ఆధ్యాత్మిక అనుభవాన్ని మెరుగుపరచడం, సౌకర్యాలు పెంచడం, భద్రతా చర్యలు బలోపేతం చేయడంపై మిగతా .. 2లో..

### భూమి దిశగా దూసుకొచ్చిన

# స్విఫ్ట్ అబ్జర్వేటరీని ఆపిన నాసా



**విశ్వం వాయిస్ న్యూస్ :** నాసా టెలిస్కోప్ 'నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ' భూమి దిశగా దూసుకొచ్చింది. వాతావరణ రాపిడి వల్ల ఇది తన కక్ష్య నుంచి భూమి వైపు కదిలింది. 585 కిలోమీటర్ల ఎత్తు నుంచి ఇది 400 కి.మీ కిందికి చేరింది. దీంతో అట్మాస్పెరిక్ డ్రాగ్ (స్పేస్‌క్రాఫ్ట్ శక్తిని కోల్పోయేలా చేస్తుంది)ను తగ్గించేందుకు తాత్కాలికంగా సైన్స్ ఆపరేషన్లను నిలిపివేశారు. అలాగే మళ్లీ దానిని యథాస్థితికి చేర్చేందుకు నాసా రీబూస్ట్ మిషన్‌ను చేపట్టింది. విశ్వంలో చోటుచేసుకునే గామా కిరణాల పేలుళ్లను గుర్తించి, అధ్యయనం చేసేందుకు ఈ అబ్జర్వేటరీని నాసా 2004లో ప్రయోగించింది. సోలార్ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# మేం పనిచేస్తున్నాం..

టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్, టెక్స్ టైల్, ఎడ్యుకేషన్, హెల్త్ పాలసీల కింద ఆయా సంస్థలకు భూములు కేటాయించడం జరిగింది. ఐదు కంపెనీలకు మాత్రమే 99 పైసలకు భూములు కేటాయించాం.

**పరిశ్రమలకు భూములు కేటాయింపుపై వాడీవేడి చర్చ**

విశాఖలో కోట్లాది రూపాయల విలువైన భూములను 99 పైసలకే ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు ఎలా కేటాయిస్తారంటూ వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, ఇతర వైసీపీ సభ్యులు మాధవరావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. దీనిపై మంత్రి నారా లోకేష్ ధీటుగా సమాధానం ఇచ్చారు. మంత్రి స్పందిస్తూ.. హైదరాబాద్ లో రహేజా మైండ్ స్పేస్ కు ఆనాడు 97 ఎకరాలను చంద్రబాబు గారు కేటాయించారు. వారు 21 బిల్డింగ్ ల ద్వారా 10వేల మిలియన్ స్క్వేర్ ఫీట్ నిర్మాణం చేశారు. నేడు ఒక్క మైండ్ స్పేస్ లోనే ఐటీ రంగంలో లక్ష మంది పనిచేస్తున్నారు. అనేక ప్రముఖ కంపెనీలు అక్కడ కొలువుదీరాయి. రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలు జీసీసీలకు అవసరమైన భవనాలు నిర్మించి అద్దెకు ఇవ్వడం జరుగుతుంది. వారు ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తారు. వారికి పారదర్శకంగా భూములు కేటాయించాం. బెంగళూరులో ఏఎన్ఎస్ఆర్ సంస్థ నిర్మించిన జీసీసీ సెంటర్ ను నేను స్వయంగా చూశా. ఈ ఒక్క కంపెనీ 150 జీసీసీలను నిర్మించడం జరిగింది. సుమారు లక్షా 40వేల మంది ఆయా జీసీసీల్లో పనిచేస్తున్నారు. భూముల కేటాయింపు విషయంలో ప్రతి కంపెనీని అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, మంత్రుల సంఘం క్షుణ్ణంగా సమీక్షించడం జరుగుతుంది. అనంతరం కేబినెట్ ఆమోదంతో భూములను కేటాయించడం జరుగుతుందన్నారు.

**క్రెడిబులిటీ ఉన్న కంపెనీలకే 99 పైసలకు భూముల కేటాయింపు**

గతంలో 99 పైసలకే వేరే కంపెనీకి భూమి ఇచ్చారని ఆరోపించారు. నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ చేస్తే పారిపోయారు. క్రెడిబులిటీ ఉన్న కంపెనీలకే 99 పైసలకు భూములు ఇస్తున్నాం తప్పే ఆయారాం గయారాం కంపెనీలకు ఇచ్చేందుకు మేం సిద్ధంగా లేం. అంతకుముందు వైసీపీ సభ్యుల తీరును మంత్రి అచ్చెన్నాయుడు తప్పుబట్టారు. పరిశ్రమలకు భూముల కేటాయింపులపై చర్చకు సిద్ధమని, ప్రశ్నోత్తరాలు గంటలోనే ముగించాలని నిర్ణయం తీసుకున్నందున బీఏసీలో చర్చించి ఈ అంశంపై లఘు చర్చ చేపట్టాలని చెప్పారు. ప్రశ్నకు సంబంధం లేనివి అడగడం వల్ల సమయం వృధా అవుతోందన్నారు.

**భూముల కేటాయింపు విషయంలో వైసీపీ పిల్‌పై కోర్టు మొట్టికాయలు వేసింది**

మంత్రి లోకేష్ సమాధానం సమాధానం పట్ల వైసీపీ సభ్యులు అభ్యంతరం లేవనెత్తారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. టీసీఎస్, కాగ్నిజెంట్, మదర్సన్, రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలకు భూములు ఇవ్వకూడదా అంటూ ప్రశ్నించారు. భూముల కేటాయింపుపై వైసీపీనే కోర్టులో పిల్ వేయించారని, కోర్టు కూడా మొట్టికాయలు వేసిందన్నారు. విశాఖలో రహేజా రియల్ ఎస్టేట్ సంస్థకు 99 పైసలకే 27.1 ఎకరాలను ఎలా కేటాయిస్తారని వైసీపీ సభ్యులు మాధవరావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి 99 పైసలకే భూములు కట్టబెట్టాలని ప్రయత్నించారని ఆరోపించారు. వైసీపీ సభ్యుల ఆరోపణలను మంత్రి లోకేష్ ధీటుగా తిప్పికొట్టారు. తాము 5 కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించామని, ఆరో కంపెనీ పేరు ప్రస్తావించినందున ఆధారాలు బయట పెట్టాలని, ఆరోపణలు చేసి బయటకు వెళ్లడం కాదని సవాల్ చేశారు. లేనిపక్షంలో తమ ప్రకటనను ఉపసంహరించుకోవాలని మంత్రి లోకేష్ పట్టుబట్టారు. ఉర్సాకు తాము ఎలాంటి భూములు కేటాయించలేదని మరోసారి స్పష్టం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకే పరిశ్రమలకు తక్కువ రేటుకు భూములు ఇస్తున్నామని చెప్పారు. ఉర్సా విషయంలో వైసీపీ సభ్యుల ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు.

# రూ.262 కోట్ల పరిహారం

దరఖాస్తు దాఖలు చేశాయి. జాహ్నవి సౌత్ లేక్ యూనియన్‌లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ కోసం 2021లో అమెరికా వెళ్లారు. 2023లో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన పోలీసు పెట్రోలింగ్ వాహనం ఆమెను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో వాహనం వేగ పరిమితి 40 కిలోమీటర్లుగా ఉండగా, పోలీసు అధికారి 119 కిలోమీటర్ల వేగంతో వాహనం నడిపాడు. దీంతో జాహ్నవి 100 అడుగుల దూరంలో ఎగిరిపడ్డారు. ప్రమాదానికి కారణమైన పోలీసు అధికారి జాహ్నవి మృతిపై నాడు జోకులు వేయడం వివాదాస్పదమైంది. "ఆమె చనిపోయింది. చాలా మామూలు మనిషి. 11 వేల డాలర్లు ఇస్తే సరిపోతుంది" అంటూ నవ్వాడు. ఈ వ్యాఖ్యలపై నాడు భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అమెరికాలోనూ ఆయన తీరుపై వ్యతిరేకత వచ్చింది. దీంతో ఆ అధికారిని విధుల నుంచి తొలగించారు.

# భారత్ కొనబోదన్నది ట్రంప్ ఒక్కరే

దిల్లీ ఆపేస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మినహా మరెవరూ చెప్పలేదన్నారు. పార్లమెంటు దిగువ సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు లావ్రోవ్ బుధవారం ఈ మేరకు సమాధానమిచ్చారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయబోమని ప్రధాని మోదీ సహా ఇతర భారతీయ నేతలెవరూ ప్రకటించలేదన్నారు. భారత్ వేదికగా ఈ ఏడాది జరగబోయే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో 'ఇంధన భద్రత' ఓ కీలకాంశంగా ఉండబోతోందని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ ఇటీవల వ్యాఖ్యానించిన సంగతిని లావ్రోవ్ గుర్తుచేశారు. ఆ సదస్సు సందర్భంగా మోదీతో రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దిల్లీతో సంబంధాల విషయంలో మాస్కో ఆకాశమే హద్దుగా ఎంత దూరమైనా వెళుందని ఉద్ఘాటించారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్నాయి. ఖర్కీవ్ ప్రాంతంలో మాస్కో బలగాలు మంగళవారం రాత్రి జరిపిన డ్రోన్ దాడిలో ఓ ఇల్లు ధ్వంసమైంది. ఈ ఘటనలో 34 ఏళ్ల ఓ వ్యక్తి, అతడి ముగ్గురు పిల్లలు మృత్యువాతపడ్డారు. మృతుల్లో ఇద్దరు రెండేళ్ల వయసున్న కవల బాలురు కాగా, మరొకరు ఏడాది వయసున్న పాప. దాడిలో ఆ పిల్లల తల్లి (35 వారాల గర్భిణి) తీవ్రంగా గాయపడింది.

# 3వ తరగతి నుంచే విద్యార్థులకు ఏఐ యాక్సెస్

మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నాయని వెల్లడించారు. భారత్‌లో గణనీయమైన యువశక్తి ఉందన్నారు. ఏఐకి సంబంధించిన పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను సృష్టించడంలో సాంకేతిక సంస్థలు పూర్తిగా నిమగ్నమయ్యాయన్నారు. ప్రస్తుతం ఏఐ యాంత్రిక మేధస్సుతో పాటు మనుషుల భావోద్వేగాలను కూడా అర్థం చేసుకుంటున్న విషయాన్ని ప్రస్తావించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా గొప్ప విజయమని అభివర్ణించారు. ఈ సమావేశానికి ముందు దిల్లీలో ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన ఎడ్‌టెక్ ఏఐ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 10 వినూత్న భారతీయ ఎడ్‌టెక్ స్టార్టప్‌ల వ్యవస్థాపకులతో ఆయన సమావేశమయ్యారు.

## స్విఫ్ట్ అబ్జర్వేటరీని ఆపిన నాసా

యాక్టివిటీ వల్ల భూ ఎగువవాతావరణం వేడెక్కి, ఈ అబ్జర్వేటరీ కక్ష్య నుంచి కిందికి రావడం ప్రారంభమైంది. దీనిని అలాగే వదిలేస్తే.. 2026 చివరి నాటికి భూవాతావరణంలోకి ప్రవేశించి కాలిపోయేది. దాని వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. అయితే దాని సేవల్ని సాధ్యమైనంత ఎక్కువకాలం కొనసాగించాలని నాసా భావిస్తోంది. రీబూస్ట్ మిషన్‌ను చేపట్టేవరకు ఆ టెలిస్కోప్‌ను 300కి.మీ.ఎత్తులో ఉంచేందుకు.. అట్మాస్ఫెరిక్ డ్రాగ్‌ను తగ్గించేలా చర్యలు తీసుకుంటోంది. కాగా.. రీబూస్ట్ మిషన్ కోసం ఆరిజోనాకు చెందిన కాటలిస్ట్ స్పేస్ టెక్నాలజీస్‌తో నాసా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ జూన్‌లో 30 మిలియన్ డాలర్లతో రోబోటిక్ లింక్ స్పేస్‌క్రాఫ్ట్ (కక్ష్యలో సర్వీసింగ్ కోసం, ఉపగ్రహ మరమ్మతు, డాకింగ్ కోసం రూపొందించిన ఒక రోబో వ్యవస్థ)ను పంపించనుంది. ఇది స్విఫ్ట్‌ను 600కి.మీ ఎత్తులో స్థిరమైన కక్ష్యలోకి చేరుస్తుంది. దాంతో అది మళ్లీ మరో పదేళ్లు సేవలు అందించడానికి వీలుకలుగుతుంది. ఈ ప్రయత్నం విజయవంతమైతే.. ఇప్పటివరకు సేకరించిన డేటాను కాపాడుకునే వీలు కలుగుతుంది.

## 12వేల మంది పోలీసులతో భద్రత : డీజీపీ

సీసీటీవీ కెమెరాల నిఘాలో ఉంచామని తెలిపారు. వెబ్ కాస్టింగ్ విధానం ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను తన కార్యాలయ కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షిస్తామని వివరించారు. లెక్కింపు కేంద్రాలకు వచ్చే మార్గాలను కఠినంగా నియంత్రిస్తున్నామని.. పాస్‌లు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఏదైనా అల్లర్లు లేదా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. కౌంటింగ్ ప్రక్రియ విజయవంతంగా ముగిసేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# కుమార్తెనే కిమ్ వారసురాలు

2022లో ప్రపంచానికి పరిచయం చేశారు. 2023లో మిలిటరీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్యాంగ్యాంగ్‌లో మరోసారి కనిపించింది. నాటినుంచి పలు అధికారిక కార్యక్రమాలకు హాజరవుతోంది. గత నెలలోనూ తల్లిదండ్రులతో కలిసి దేశ మాజీ నేతల స్మారక ప్రదేశం 'కుమ్‌సుసన్ ప్యాలెస్ ఆఫ్ ది సన్'ను సందర్శించింది. ఇవన్నీ ఆమె కిమ్ వారసురాలన్న వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. ఉత్తర కొరియా పగ్గాలు ఆమెకే అప్పగిస్తారా? అని దక్షిణ కొరియా నిఘా అధికారులు మొదట్లో అనుమానాలు వ్యక్తం చేశారు. ఆ దేశ సంప్రదాయవాద సంస్కృతి, పురుషాధిక్య నాయకత్వ క్రమాన్ని పరిగణనలోకి తీసుకుని ఈమేరకు అంచనాకు వచ్చారు. కానీ.. దేశ మీడియాలో ఆమె ప్రముఖంగా కనిపిస్తుండటంతో పునఃసమీక్ష చేశారు. ఈ క్రమంలోనే వారసురాలిగా ఆమె నియమాకం కీలక దశలో ఉన్నట్లు తెలిపారు. ఉన్నత స్థాయి సైనిక కార్యక్రమాల్లో పాల్గొనడం, కుమ్‌సుసన్ పర్యటనలో భాగం కావడం, కొన్ని విధానపరమైన విషయాల్లో తండ్రి ఆమె అభిప్రాయాలను కోరడం వంటివాటిని సంకేతాలుగా ఉదహరించినట్లు సమాచారం. దక్షిణ కొరియా నిఘా వర్గాల ప్రకారం.. కిమ్‌కు ముగ్గురు పిల్లలు. కిమ్ జు యే రెండో సంతానం. ఆమెకు 13 ఏళ్లు ఉంటాయని భావిస్తున్నారు. కిమ్ కూడా వంశపారంపర్యంగానే అధికారానికి వచ్చారు. తండ్రి కిమ్ జోంగ్ ఇల్ మరణానంతరం పగ్గాలు చేపట్టారు. ఫిబ్రవరి నెలాఖరులో కిమ్‌కు చెందిన వర్కర్స్ పార్టీ సదస్సు జరగనుంది. ఇదే వేదికగా ఆయన తన వారసత్వ ప్రణాళికలకు పార్టీపరంగా ఆమోదముద్ర వేసుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# అంబటికి 14 రోజుల రిమాండ్

పరిశీలించిన న్యాయమూర్తి రాంబాబుకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలిచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు రాంబాబును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఇదీ కేసు నేపథ్యం.. 2023 జనవరిలో అంబటి రాంబాబు మంత్రి హోదాలో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఇందుకోసం అక్కడి వాలంటీర్ల ద్వారా పింఛనుదారులకు నెలవారీగా ఇచ్చే పింఛను మొత్తం నుంచి రూ.200 చొప్పున మినహాయించుకుని రెండేసి లాటరీ టికెట్లు ఇచ్చారు. సంక్రాంతి రోజు లాటరీ తీసి బహుమతులు పంచారు. ఇది చట్టవిరుద్ధమని గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు గుంటూరు ప్రధాన సీనియర్ సివిల్ కోర్టులో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు అప్పట్లో సత్తెనపల్లి పట్టణ పోలీసులు రాంబాబుతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు.

# తీవ్ర హెచ్చరికలు

పిచ్చి స్టేటస్‌లతో ఎవరిపై పోరాటం చేస్తున్నారని పల్లా నిలదీశారు. అనుభవరాహిత్యంతో పొరపాట్లు జరుగుతున్నాయని కొలికపూడి ఆయనకు వివరణ ఇచ్చారు. సీనియర్లు తనకు మార్గనిర్దేశం చేయాలని కోరారు.

# అదనపు ధాన్యం తీసుకోండి

అదనంగా 18 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాల్సి వచ్చింది. అందువల్ల 10శాతం నూకతో సహా ఎఫ్‌సీఐ తీసుకోవాలి. 2024-25 యాసంగి పంటకు సంబంధించి 5శాతం నూకతో ఇప్పటికే అనుమతిచ్చినదానికి అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుమతివ్వాలి. 2024-25 వానాకాలం పంటకు సంబంధించి కస్టమ్స్ మిల్లింగ్ రైస్ ఫిబ్రవరి 28వ తేదీవరకు గడువు నిర్దేశించారు. కానీ దాన్ని మరో రెండునెలలు పొడిగించాలి"అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్రమంత్రికి విజ్ఞప్తిచేశారు.

# బీమా రూ.10 లక్షలకు పెంపు

ప్రధానంగా దృష్టి సారించింది. పహల్గాం, బాల్తాల్ యాత్రా మార్గాల్లో టాయిలెట్ల ఏర్పాటుకు ప్రదేశాలను గుర్తించాలని సిన్హా ఆదేశించారు. అవసరమైన షెడ్లు, రెయిన్ షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. వైద్య సదుపాయాలు, విపత్తు నిర్వహణ, భద్రతా ఏర్పాట్ల పెంపు తదితర అంశాలపై చర్చించారు. జమ్మూకశ్మీర్ ఆధ్యాత్మిక చరిత్రను చాటిచెప్పేలా, అమర్‌నాథ్ మంచులింగం విశిష్టతను వివరించేలా శ్రీనగర్, జమ్మూలలో లేజర్, సౌండ్ షోలు నిర్వహించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. జమ్మూకశ్మీర్‌లోని మంచు పర్వతాల్లో దాదాపు 13 వేల అడుగుల ఎత్తున వెలిసే మంచులింగ దర్శనం కోసం ఏటా అమర్‌నాథ్ యాత్ర నిర్వహిస్తారు. పహల్గాం లేదా బాల్తాల్ మీదుగా అక్కడికి చేరుకోవచ్చు. పహల్గాం మార్గంలో 48 కిలోమీటర్లు, బాల్తాల్ నుంచి 14 కిలోమీటర్ల దూరం నడవాల్సి ఉంటుంది.

# కార్మికులకు బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను రద్దు చేయండి : సిఐటియు

**పోలవరం జిల్లా రంపచోడవరం సిఐటియు ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె ర్యాలీ - కనీస వేతనం 26000 ఇవ్వాలి - స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**

**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** కేంద్ర కార్మిక సంఘాల ఇచ్చిన పిలుపుతో దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా పోలవరం జిల్లా రంపచోడవరం కేంద్రంలో ప్రజాసంఘాల కార్యాలయం నుండి బస్టాండ్ మీదుగా ఐటీడీఏ ముందు వరకు సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు కంభంశాంతిరాజు సభ అధ్యక్షతన సభ నిర్వహించారు.పోలవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు ఉన్న చట్టాలను రద్దుచేస్తూ కార్పొరేట్ కంపెనీలుకు అనుకూలంగా నూతన చట్టాలు పేరుతో నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారని విమర్శించారు. కార్మికులకు ఎనిమిది గంటల పని గంటల్ని 10 నుంచి 12 గంటలకు పెంచడం దుర్మార్గమని విమర్శించారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. తక్షణమే లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చట్టం చేయాలని, రైతు పంటను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు చట్ట పరిధిలో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించడం దుర్మార్గమన్నారు. నూతనంగా తీసుకొచ్చిన




పథకంలో వ్యవసాయ కూలీలకు అన్యాయం చేసే విధంగా ఉందని ఆవేదన చెందారు. గతంలో 90 శాతం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను ప్రస్తుతం 60 శాతానికి తగ్గించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం 40% భరించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడే అవకాశం ఉందని ఆందోళన వెళ్ళబుచ్చారు. భారీ స్థాయిలో నిధులు కేటాయించలేని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని ఆటకెక్కించేందుకు ప్రయత్నిస్తుందని దుయ్యబట్టారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక లేబర్ కోడ్లను రద్దు చేసి అంగన్వాడీ,ఆశ, మధ్యాహ్నం భోజనం కార్మికులు మరియు స్కూల్ శానిటేషన్ కార్మికులు,వెలుగు యానిమేటర్స్, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ స్కీమ్ వర్కర్ల కనిసవేతనం చట్టం ప్రకారం 26000 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.తమ డిమాండ్లకు ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే రోజుల్లో తీవ్రమైన పోరాటాలు,ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటీకి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఉన్న హక్కులను కాలరాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమైందని విమర్శించారు. న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు దూలయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను భవిష్యత్తులో కార్మిక సంఘాలను ఐక్యం చేసి ఉధృతమైన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కంభం శాంతిరాజు, సిఐటియు మండల కన్వీనర్ తీగల శ్రీనివాస్ గిరిజన సంఘం జిల్లా నాయకులు సాదల విద్యాసాగర్ అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు కారం రామలక్ష్మి ,కొమరం మంగాయమ్మ, జి.బేబీ రాణి,ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కలింకోట రమణమ్మ, కొమరం చెల్లయమ్మ,వెలుగు యానిమేటర్స్ జిల్లా కార్యదర్శి, అరగాటి రామక్రిష్ణ, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు జోగారావు. సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు లచ్చిరెడ్డి, సిపిఐ డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్. ఆదివాసి పార్టీ జిల్లా ఇన్చార్జ్ మద్దిటి.అంజిరెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ముమ్మర వాహన తనిఖీలు

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : జిల్లా ఎస్పి రాహుల్ మీనా**

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రిం చేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వాహనదారులను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. వయస్సు నిండకుండానే వాహనాలు నడిపిన వారిని గుర్తించి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. అలాగే హెల్మెట్ లేకుండా బైక్ నడిపిన వారికి జరిమానాలు విధించడంతో పాటు, హెల్మెట్ ప్రాణ రక్షణలో ఎంత ముఖ్యమో వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా అతి వేగంగా వాహనాలు నడిపిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. కేవలం జరిమానాలు విధించడం మాత్రమే కాకుండా, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడానికీ పోలీసులు ముందుకు వచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని, ఒక్క నిర్లక్ష్యం కుటుంబాలకు జీవితాంతం బాధ మిగుల్చవచ్చని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ మాట్లాడుతూ, ప్రజల రక్షణే మా ప్రాధాన్యత. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. ముఖ్యంగా యువత మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దు. లైసెన్స్, హెల్మెట్, వాహన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలి అని సూచించారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీలు రాబోయే రోజుల్లో కూడా కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

**వంగలపూడి శివరాత్రి ఏర్పాట్లను**

# పరిశీలించిన పోలీసు అధికారులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లా ఏఆర్ ఎడిషనల్ ఎస్పీ చెంచురెడ్డి, నార్త్ జోన్ డిఎస్పి వై.శ్రీకాంత్, కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వి వి ఎస్ మూర్తి మరియు సీతానగరం ఎస్సై డి.రామ్ కుమార్ కలసి వంగలపూడి శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించారు. శివరాత్రి కమిటీ సభ్యులకు మరియు ట్రాక్టర్ డ్రైవర్లకు తగు సూచనలు చేశారు. సదరు పర్యటనలో భాగంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వంగలపూడి నుండి మాత్రమే భక్తులు పట్టిసీమ దర్శనానికి వెళ్లాలని అనధికారకంగా అనుమతులు లేని రామచంద్రపురం నుండి గాని మరి ఇతర ప్రదేశాల నుండి గాని వెళ్లడానికి అనుమతి లేదని అది భక్తులకు క్షేమం కాదని అన్ని ఏర్పాట్లు చేసిన వంగలపూడి వద్ద నుండి మాత్రమే భక్తులు దైవదర్శనానికి వెళ్లాలని తెలియజేశారు.అదేవిధంగా బ్రీతింగ్ అనలైజర్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ట్రాక్టర్ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేస్తామని భక్తుల భద్రతే ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఆర్ఓ మరియు ఇతర డిపార్ట్మెంట్ అఫీషియల్స్ పాల్గొన్నారు.

# కోరుకొండ నరసన్న రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ రోడ్డు ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టడంతో పలు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల తరబడి పలు గ్రామాల ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులతో అనునిత్యం నరకం చూస్తున్నామని, గత ప్రజాప్రతినిధులు కూడా చూసి చూడనట్టు ఉదాసీనతగా వ్యవహరించడంతో అనునిత్యం వాహనదారులు చుక్కలు చేస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణకు గత ప్రభుత్వలలో నిధులు వచ్చిన, వ్యాపారస్తులు ప్రజా ప్రతినిధులను వారికి అనుకూలంగా ప్రసన్నం చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నరసన్న ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వాలలో పలు ప్రణాళికలు రచించిన, ప్రధాన రహదారి విస్తరణ వద్దే నిలిచిపోవడం, భక్తుల సౌకర్యార్థం లక్షల పెట్టి నిర్మించిన డార్మెంటరీలు అక్కరకు రాకపోవడం, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారుల తీరుకు దర్పణంగా నిలుస్తున్నాయనీ చెప్పక తప్పదు. పాండవుల కొండ నుండి నరసన్న కొండకు "రోప్ వే" గాలిలోనే తేలి ఆడుతుండం, శ్రీ రంగనాథ స్వామిని "ఆరుబయటే" ఉంచడం, నరసన్న దర్శనార్థం విచ్చేసిన భక్తులకు తాగునీటి సమస్య, మరోవైపు కోతులు బెడద వంటి ఎన్నో సమస్యలు శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు.ఇకనైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న తపన, ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టాలన్న యోచనతో చిత్త శుద్ధితో పనులు పూర్తి చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా అభివృద్ధి పనులు చక చక సాగుతాయో, అక్రమార్కుల అడ్డుకట్టతో ఆగుతాయో వేచి చూద్దాం.

**ట్రాఫిక్ ఇక్కట్లకు చెక్- పలువురు హర్షం**



# ఎడిటర్ వాయిస్

## విశాఖకు దిగ్గజ ఐటీ సంస్థ..

### హుద్ హుద్ దెబ్బకు అప్పుడు ఖాళీ, ఇప్పుడు మళ్లీ ఎంట్రీ!

ఐటీ మంత్రి లోకేశ్ ఆహ్వానం మేరకు ఐబీఎం విశాఖలో కార్యాలయం తెరవాలని అనుకుంటోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. విశాఖ నగరానికి మరో ఐటీ దిగ్గజం రానుంది. రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేస్తున్న ఐబీఎం.. విశాఖలోనూ తమ క్యాంపస్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఐటీ మంత్రి లోకేశ్ ఆహ్వానం మేరకు ఐబీఎం విశాఖలో కార్యాలయం తెరవాలని అనుకుంటోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తాత్కాలిక కార్యాలయం ప్రారంభానికి కో-వర్కింగ్ స్పేస్ కోసం వెతుకుతున్న ఐబీఎం ప్రతినిధులు శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి తగిన భూములను ఇప్పటికే పరిశీలించి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే విశాఖ ఐటీ హబ్ లో టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ఎన్ఎన్సీలు తమ క్యాంపస్ లు నిర్మిస్తున్నాయి. కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయం ఇప్పటికే ప్రారంభించగా, టీసీఎస్ నేడో రేపో క్యాంపస్ ఓపెనింగ్ కు సన్నాహాలు చేస్తోంది. అదేవిధంగా ఇన్ఫోసిస్ సైతం విశాఖ కార్యాలయాన్ని విస్తరించాలని నిర్ణయించిందని అంటున్నారు. ఈ క్రమంలోనే ప్రతిష్ఠాత్మక ఐబీఎం కూడా విశాఖ వైపు చూస్తోందన్న ప్రచారం టెక్ ఉద్యోగుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. దిగ్గజ సంస్థలు అన్నీ విశాఖకు క్యూ కడుతుండటంతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. విశాఖ ఐటీ కారిడార్ లో 20 ఎకరాల స్థలం కేటాయించాల్సిందిగా ఐబీఎం ప్రతినిధులు వీఎంఆర్డీఏ అధికారులను సంప్రదించినట్లు ప్రచారం జరుగుతోంది. అధికారుల సూచనలతో ఐబీఎం ప్రతినిధులు విశాఖ-భీమిలి మార్గంలో అనువైన స్థలాలను పరిశీలించారని చెబుతున్నారు. నిజానికి ఐబీఎం విశాఖకు కొత్త కాదు. 2011లోనే ఐబీఎం విశాఖలో తన కార్యాలయాన్ని తెరిచింది. అయితే 2014లో వచ్చిన హుద్ హుద్ తుఫాన్ తాకిడితో ఐబీఎం కార్యాలయం పూర్తిస్థాయిలో దెబ్బతింది. ఆ తర్వాత పునరుద్ధరణ పనులు చేయకుండా ఐబీఎం విశాఖ నుంచి నిష్క్రమించిందని గుర్తు చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కెనెక్సా అనే ఐటీ కంపెనీకి రుషికొండ ఐటీ హిల్స్ లో 25 ఎకరాలను కేటాయించారు. ఆ సంస్థ కొన్నాళ్లు ఐటీ కార్యాలయాన్ని నడిపి ఆ తర్వాత ఐబీఎంకు విక్రయించిందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఎకరాకు 100 మంది చొప్పున 25 ఎకరాలకు 2,500 మందికి ఐటీ ఉద్యోగాలు కల్పించాలని అప్పట్లో ప్రభుత్వం షరతు విధించడంతో ఐబీఎం వెనక్కి తగ్గింది. కెనెక్సా నుంచి తీసుకున్న 25 ఎకరాల్లో దాదాపు 21.80 ఎకరాలను ప్రభుత్వానికి తిరిగి అప్పగించిందని చెబుతున్నారు. మిగిలిన 3.2 ఎకరాల్లో ఐబీఎం కార్యాలయం ప్రారంభించి కార్యకలాపాలను నడిపింది. అయితే 2014లో విశాఖను కుదిపేసిన హుద్ హుద్ తుఫాన్ వల్ల ఐబీఎం కార్యాలయం తీవ్రంగా నష్టపోయింది. దీంతో ఐబీఎం తన కార్యాలయాన్ని ఇన్ఫినిటీ అనే సంస్థకు విక్రయించి విశాఖ నుంచి వైదొలగిందని చెబుతున్నారు. ఇది జరిగిన పదేళ్లకు మళ్లీ విశాఖపై ఐబీఎం దృష్టి పెట్టింది. మంత్రి లోకేశ్ సూచనలతో విశాఖ ఐటీ కారిడార్ లో భారీ క్యాంపస్ నిర్మాణానికి ముందుకొచ్చినట్లు చెబుతున్నారు. ఇక ప్రస్తుతం శాశ్వత కార్యాలయం నిర్మాణానికి రెండు మూడేళ్ల సమయం పట్టే అవకాశం ఉండటంతో అద్దె భవనాల్లో తాత్కాలిక క్యాంపస్ ప్రారంభానికి ఐబీఎం యోచిస్తున్నట్లు చెబుతున్నారు. ఐస్రాపట్ అనే సంస్థ కూడా విశాఖలో బ్రాంచి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోగా,



తాత్కాలికంగా కార్యకలపాల నిర్వహణకు నగరంలోని ఇసుకతోట జంక్షన్ లో లాన్సమ్ బిల్డింగ్ లో ఒక ఫ్లోర్ అద్దెకు తీసుకున్నట్లు చెబుతున్నారు. ఈ సంస్థ ఐటీ కంపెనీలకు కో-వర్కింగ్ స్పేస్ సమకూర్చుతుంటుందని అంటున్నారు. దీంతో ఐబీఎం కూడా ఇసుకతోటలోని లాన్సమ్ బిల్డింగ్ లో కో-వర్కింగ్ స్పేస్ ను తీసుకోవాలని ప్లాన్ చేస్తోందని చెబుతున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## ప్రభుత్వ ఉపాధ్యాయురాలిపై కత్తితో దాడి..

### బంగారు ఆభరణాలు చోరీ



**గూడూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో దారుణం జరిగింది. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిపై ఆటో డ్రైవర్ కత్తితో దాడి చేసి బంగారు ఆభరణాలు అపహరించాడు. గూడూరు రూరల్ మండలం కందలి వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హరిత (35) బాలాయపల్లి మండలం గొట్టిగాడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. గూడూరు నుంచి పాఠశాలకు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. ఈ క్రమంలో నిర్మానుష్య ప్రదేశంలో డ్రైవర్ ఆటో ఆపి హరితపై కత్తితో దాడి చేశాడు. అనంతరం ఆమె బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. గాయపడిన ఉపాధ్యాయురాలిని గూడూరు ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ ఘటనపై గూడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కారు నడుపుతూ కుప్పకూలిన వైద్యుడు

### రోగులకు సత్వర వైద్యమే మన కర్తవ్యమని రెండు గంటల ముందే సిబ్బందికి సూచన

### అంతలోనే గుండెపోటుతో మృతి



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** 'ప్రాణం విలువైనది.. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి రోగులకు సత్వర వైద్యం అందించగలిగితే కాపాడినవారమవుతాం..' అంటూ సిబ్బందికి సూచించిన ఓ వైద్యాధికారి రెండు గంటలకే గుండెపోటుతో మరణించిన విషాద ఘటన ఇది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో ఆర్ఎంవోగా పనిచేస్తున్న డాక్టర్ అందే వెంకటరమా సత్య తాతారావు (56) తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ఉంటారు. బుధవారం విధులకు హాజరై రోగులను చూశారు. సిబ్బందికి పలు సూచనలూ చేశారు. గుండెల్లో మంటగా ఉండటంతో ముందు జాగ్రత్తగా ఈసీజీ తీయించుకుని, ఏ సమస్యా లేదని అనుకున్నారు. మధ్యాహ్నం సెలవు పెట్టి కారు నడుపుకొంటూ ఇంటికి బయలుదేరారు. ఉండ్రాజవరం జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోకి చేరుకోగానే గుండెపోటు రావడంతో కారును పంట కాలువ మార్జిన్‌లో ఆపేశారు. కారు జారి ఉండటాన్ని గమనించిన స్థానికులు అద్దాలు పగలగొట్టి ఆయనను బయటకు తీసి సీపీఆర్ చేశారు. అదే సమయంలో అటుగా వస్తున్న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు సమీప ప్రైవేట్ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించే ఏర్పాటు చేశారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తాతారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారు వైద్య విద్య అభ్యసిస్తున్నారు.

**ఆసుపత్రిలో తాతారావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది**

పేదల వైద్యుడిగా..: డాక్టర్ తాతారావు స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు. ఎక్కువ కాలం నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేశారు. నిడదవోలులో ఆయన నిర్వహిస్తున్న 'అమ్మ' ఆసుపత్రిలో పేదలకు చికిత్సలో వెసులుబాటు కల్పించేవారు. దీంతో పేదల వైద్యుడిగా పేరొందారు. అనంతరం మృతదేహాన్ని మొగల్తూరు తరలించారు.

## గంజాయి కేసుల్లో 157 మందికి శిక్షలు : డీజీపీ

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గంజాయి, మాదకద్రవ్యాలకు సంబంధించి గతేడాది జనవరి నుంచి ఇప్పటివరకూ 72 కేసుల్లో 157 మందికి శిక్షలు పడ్డాయని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా చెప్పారు. అత్యధికంగా అనకాపల్లి జిల్లాలో 21, అల్లూరి సీతారామరాజు-11, విజయనగరం-7, విశాఖపట్నం-6, గుంటూరు జిల్లాలో 6 కేసుల్లో శిక్షలు పడ్డాయని తెలిపారు. ఈ మేరకు డీజీపీ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించి ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు కాల్ చేసి సమాచారమివ్వాలని సూచించారు.

### అల్లరి చేస్తున్నాడని

## కన్నుపోయేలా దాడి

### బాలుడిపై అంగన్‌వాడీ టీచర్ దాష్టీకం



**ఎల్లారెడ్డిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అభం శుభం తెలియని మూడున్నరేళ్ల బాలుడిపై ఓ అంగన్‌వాడీ టీచర్ దాష్టీకానికి ఒడిగట్టారు. అల్లరి చేస్తున్నాడనే నెపంతో బాలుడిని చితక బాదగా.. తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో బుధవారం వెలుగు చూసింది. బాధితుల కథనం ప్రకారం.. స్థానికులైన కొంపెల్లి లక్ష్మి, విజయ్‌కుమార్ దంపతుల కుమారుడు విద్వాన్ష్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం (ఈ నెల 10) కూడా తల్లి లక్ష్మి కేంద్రంలో వదిలి వెళ్లారు. అదేరోజు మధ్యాహ్నం అంగన్‌వాడీ టీచర్ రాణి.. లక్ష్మికి ఫోన్ చేసి.. మీ అబ్బాయికి జ్వరం వచ్చిందని, ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. తల్లి వెళ్లి చూసేసరికి అప్పటికే విద్వాన్ష్ కుడి కన్ను ఉబ్బిపోయి చేతులు, కాళ్లు గాయాలతో కమిలి పోయాయి. ఆ రోజు రాత్రి తండ్రి విజయ్‌కుమార్ బాలుడిని సిరిసిల్లలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అంగన్‌వాడీ టీచర్ రాణి తన కుమారుడిని అన్యాయంగా కొట్టి, గాయపరిచారంటూ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనపై జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, సీడీపీవో ఉమారాణి విచారణ చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్ వివరణ తీసుకొని, ఉన్నతాధికారులకు నివేదించినట్లు జిల్లా సంక్షేమాధికారి పేర్కొన్నారు.

## కనక వర్షమంటూ వంచించిన తాంత్రికుడు

### ముగ్గురి హత్య కేసులో నకిలీ బాబా అరెస్టు

**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** తాంత్రిక పూజ చేయించి ధన వర్షం కురిపిస్తానని మభ్యపెట్టి ముగ్గురు వ్యక్తులను హతమార్చిన కమ్రుద్దీన్ అనే నకిలీ బాబాను అరెస్టు చేసినట్లు దిల్లీ పోలీసులు బుధవారం వెల్లడించారు. కమ్రుద్దీన్ గతంలో రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్‌లో ఇలాంటివే రెండు హత్య కేసులకు బాధ్యుడని వివరించారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌కు చెందిన ఈ నకిలీ బాబా స్థానికంగానే కాకుండా ఘాజియాబాద్ సమీపంలో లోనీ అనే చోట కూడా తంత్ర పూజల కేంద్రాలను నడుపుతున్నాడు. ఈ నెల 8 రాత్రి ముగ్గురు వ్యక్తులు ఒక కారులో అచేతన స్థితిలో ఉన్నారంటూ దిల్లీ పోలీసులకు ఫోన్ కాల్ వచ్చింది. వారిని ఆస్పత్రికి చేర్చేసరికే ప్రాణాలు కోల్పోయారు. ఆ ముగ్గురిలో 40 ఏళ్ల మహిళ, 76 ఏళ్ల వృద్ధుడు, 42 ఏళ్ల పురుషుడు ఉన్నారు. వారిని కరీముల్లా కారులో దిల్లీకి తీసుకువస్తున్నట్లు సీసీటీవీ కెమేరాలు చూపాయి. ధన వర్ష పూజ కోసం రెండు లక్షల రూపాయలు, కూల్ డ్రింకులు, మద్యం సీసాలు తీసుకురావాలని కమ్రుద్దీన్ పురమాయించాడు. లోనీ నుంచి దిల్లీకి వచ్చే దారిలో కారులోనే వారికి విషపు లడ్డూలు తినిపించి పానీయాలు తాగించాడు. బాధితులు అపస్మారక స్థితిలోకి జారుకోగానే డబ్బుతో ఉడాయించాడు.

## వడ్లమూడి విజ్ఞాన్ కళాశాల విద్యార్థిపై దాడి

### తోటలోకి తీసుకెళ్లి చితకబాదిన వైనం

**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** చేబ్రోలు వడ్లమూడిలోని విజ్ఞాన్ విద్యాసంస్థల్లో చదువుతున్న ఒక విద్యార్థిపై తోటి విద్యార్థులే దారుణంగా దాడి చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. సదరు విద్యార్థిని కొంతమంది తోటి విద్యార్థులు మాటలతో నమ్మించి, కళాశాల సమీపంలో ఉన్న ఒక నిర్జన ప్రదేశంలోని తోటలోకి తీసుకెళ్లారు. తోటలోకి తీసుకెళ్లిన తర్వాత, అక్కడ గుంపుగా చేరిన విద్యార్థులు బాధితుడిపై విచక్షణారహితంగా దాడి చేశారు. కర్రలతో, చేతులతో చితకబాదినట్లు సమాచారం. ఈ దాడికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. పాత కక్షలా లేదా విద్యార్థుల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ ఇంతటి తీవ్ర రూపం దాల్చిందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. బాధితుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి, దాడికి పాల్పడిన విద్యార్థులను గుర్తించే పనిలో ఉన్నారు. విద్యాసంస్థల యాజమాన్యం కూడా దీనిపై అంతర్గత విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇది ప్రాథమిక సమాచారం మాత్రమే పోలీసుల పూర్తిస్థాయి విచారణ అనంతరం నిందితులు ఎవరు.? అసలు గొడవకు కారణం ఏమిటి.. అనే మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయి.

# మహాశివరాత్రి 15 లేదా 16 ఫిబ్రవరి ఎప్పుడు?




దేవదేవుడైన మహాదేవుని ప్రియమైన మహాశివరాత్రి హిందువులకు ఒక పెద్ద పండుగ. శివరాత్రి ప్రతి నెలా కృష్ణ పక్షంలో చతుర్దశి తిథి నాడు వస్తుంది... మహాశివరాత్రి పండుగ ఫాల్గుణ మాసం కృష్ణ పక్షంలోని చతుర్దశి నాడు వస్తుంది. మహాశివరాత్రి రోజున శివలింగ రూపంలో భోళా శంకరుడు ప్రత్యక్షమయ్యాడని మతపరమైన నమ్మకం. మనస్సు, చిత్తము, బ్రహ్మ, మాయ, జీవుడు, బుద్ధి, ఆకాశం, వాయువు, అగ్ని, నీరు భూమి కలిసి శివలింగాన్ని ఏర్పరుస్తాయని చెబుతారు. అందుకే మహాశివరాత్రి నాడు చేసే శివ సాధన ప్రతి కోరికను నెరవేరుస్తుంది.

ఈ ఏడాది (2026) మహాశివరాత్రి 15 లేదా 16 ఫిబ్రవరి ఎప్పుడు?

చతుర్దశి తిథి ప్రారంభం - 2026 ఫిబ్రవరి 15 ఆదివారం సాయంత్రం 04:47

చతుర్దశి తిథి ముగింపు - 2026 ఫిబ్రవరి 16 సోమవారం సాయంత్రం 05:32

సాధారణంగా హిందూ మతంలో పండుగలు ఉదయానికి తిథి ఉన్న రోజునే పరిగణలోకి తీసుకుంటారు. కానీ మహాశివరాత్రి పండుగ రాత్రికి తిథి ఉండడం అత్యంత ప్రధానం. ఎందుకంటే శివుడు లింగరూపంలో ఉద్భవించింది అర్ధరాత్రి సమయం.

## నాలుగు జాముల శివ పూజ ముహూర్తం తెలుసుకోండి!



అందుకే సూర్యాస్తయమం నుంచి తిరిగి సూర్యోదయం వరకూ తిథి నిశితకాల సమయాన్నే మహాశివరాత్రి పర్వదినంగా భావిస్తారు. ఈ లెక్కన... చతుర్ధశి తిథి ఫిబ్రవరి 15 ఆదివారం సూర్యాస్తయం సమయానికి ప్రారంభమై ఫిబ్రవరి 16 సోమవారం సాయంత్రం వరకూ ఉంది. అర్ధరాత్రి చతుర్ధశి ఉన్న 15వ తేదీనే మహాశివరాత్రి జరుపుకుంటారు.

నిశిత కాల ముహూర్తం - అర్ధరాత్రి 12:09 - అర్ధరాత్రి 01:01

మహాశివరాత్రి నాడు నాలుగు ప్రహరాల ముహూర్తం

రాత్రి మొదటి ప్రహర పూజా సమయం -సాయంత్రం 06:11 - రాత్రి 09:23

రాత్రి రెండవ ప్రహర పూజా సమయం - రాత్రి 09:23 - 16 ఫిబ్రవరి, ఉదయం 12:35

రాత్రి మూడవ ప్రహర పూజా సమయం - 16 ఫిబ్రవరి అర్ధరాత్రి 12:35 - 03:47

రాత్రి నాల్గవ ప్రహర పూజా సమయం - 16 ఫిబ్రవరి వేకువజామున 03:47 - ఉదయం 06:59

### శివుని పుట్టుక కథ

శివ పురాణం కథ ప్రకారం.. సృష్టి ప్రారంభమైన తర్వాత విష్ణువు - బ్రహ్మ మధ్య శక్తి ప్రదర్శనపై వివాదం జరిగింది. ఆ సమయంలో శివుడు లింగరూపంలో ఉద్భవించాడు. దానికి ఆది అంతం ఎవరు కనుక్కుంటారో వారి శక్తివంతులు అని. విష్ణువు క్రిందికి వెళ్లగా..బ్రహ్మ పై భాగాన్ని వెదుక్కుంటూ వెళ్లాడు. కానీ ఎవరికీ ఆది-అంతం దొరకలేదు. విష్ణువు తిరిగి వచ్చి తాను ఆది కనుక్కోలేకపోయానని చెప్పాడు. కానీ బ్రహ్మ మాత్రం మల్లెపూలు, ఆవును సాక్ష్యంగా తీసుకొచ్చాడు.ఆ సమయంలో ప్రత్యక్షమైన శివుడు బ్రహ్మకు ఆలయాలు ఉండవని, మల్లెపూవును పూజకు వినియోగించరాదని శాపం ఇచ్చాడు. పరమేశ్వరుడు లింగరూపంలో ఉద్భవించిన సమయం మహాశివరాత్రి వేళ అత్యంత విశిష్టమైనది.

# విశ్వ వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శుక్రవారం, 13 ఫిబ్రవరి 2026




www.viswamvoice.com

### కడియంలో హోమ్ స్టేలు,

# పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం

### నర్సరీ ఉత్పత్తుల ఎగుమతులకు సింగిల్ డెస్క్ ఏర్పాటు : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కడియం మండలాన్ని పర్యాటక, ఉద్యాన రంగాలలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం 2024-29 ప్రకారం హోమ్ స్టేలను ప్రోత్సహించే దిశగా నిర్మాణాలు చేపట్టడానికి గరిష్టంగా 30 శాతం వరకు ప్రభుత్వ రాయితీ అందుబాటులో ఉంటుందని ఆమె వెల్లడించారు. గురువారం బొమ్మూరు కలెక్టరేట్‌లో కడియం మండలంలో హోమ్ స్టేల నిర్మాణం, నర్సరీ ఉత్పత్తుల విదేశీ ఎగుమతులు, పర్యాటకాభివృద్ధి తదితర అంశాలపై నర్సరీ రైతులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి చర్చించారు. కడియం నర్సరీలలో పెంచే వివిధ రకాల మొక్కలకు విదేశాలలో విశేష డిమాండ్ ఉన్న నేపథ్యంలో, రైతులు నేరుగా ఎగుమతులు చేపట్టేందుకు అవసరమైన అనుమతులు, ధృవపత్రాలు సులభంగా పొందేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ క్రమంలో బొమ్మూరు ఆర్‌టీఐహెచ్‌లో గాని లేదా కడియంలో గాని 'సింగిల్ డెస్క్' వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎగుమతి ప్రక్రియలను సరళీకృతం చేయాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ అభివృద్ధి కింద కడియం మండల అభివృద్ధిని ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు ఇతర రైతులను చైతన్యపరచి, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను వినియోగించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. దీని ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు. కడియం నర్సరీల సోయగాన్ని పర్యాటక అవకాశంగా మలుచుకునేందుకు హోమ్ స్టేలు నిర్మించడం లాభదాయకమని కలెక్టర్ వివరించారు. రాజమహేంద్రవరం వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో, భవిష్యత్తులో హోమ్ స్టేలకు మంచి డిమాండ్ ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని అదనపు ఆదాయ వనరులను సృష్టించుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, కడియం నుంచి వాడపల్లి వరకు కాలువ మార్గంలో బోటు సౌకర్యాలు కల్పించే అంశాన్ని పరిశీలించాలని, దీని ద్వారా పర్యాటక రంగం మరింత విస్తరించే అవకాశముందని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్, డిహెచ్ఓ మల్లికార్జునరావు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ సూర్యప్రకాశ్, కడియం నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్‌పై కథం తొక్కిన కార్మిక లోకం

### సమ్మె విజయవంతం – లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కార్మిక, ఉద్యోగ సంఘాలు డిమాండ్
### రాజమహేంద్రవరం మెయిన్ రోడ్‌లో భారీ ప్రదర్శన




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మె సక్సెస్ అయింది. చాంబర్ ఆఫ్ కామర్స్ ఇతర సంఘాలు సైతం మద్దతు తెలపడంతో నగరంలోని పలు వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. దీంతో మధ్యాహ్నం వరకూ కొన్ని వ్యాపార సముదాయాలు వెలవెలబోయాయి. నగరంలోని కోటిపల్లి బస్టాండ్ నుంచి కోటగుమ్మం వరకూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీలో వందలాది మంది ఉద్యోగులు, కార్మికులు పాల్గొనిక కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ నినాదాలు చేశారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్, ఎల్బీసి, బ్యాంక్ ఉద్యోగ సంఘాలు, మహాప్రదర్శనకు శ్యామల సెంటర్ వద్ద సాదర స్వాగతం పలికాయి. అనంతరం ఉద్యోగులు ర్యాలీతో కలిసి నడిచారు. ఆనంతరం కోటగుమ్మం సెంటర్ సమీపంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పవన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ మాట్లాడుతూ మోడీ 12 సంవత్సరాల పాలనలో దేశం తిరోగమనంలో ఉందని అన్నారు. నోట్లరద్దు, జిఎస్టి, విద్యుత్ సంస్కరణలు ప్రజలపై మోయలేని భారాలను విధించారని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల స్థానంలో తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ హక్కులను కాలరాసేలా ఉన్నాయన్నారు. గత సమ్మెతో పోల్చితే ప్రస్తుత సమ్మె రెట్టింపు సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నాని వివరించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన 53వేల కోట్ల బడ్జెట్లో సామాన్యునికి స్థానం లేదన్నారు. రుణమాఫీలు, రాయితీలు ఇచ్చి కార్పొరేట్ కంపెనీల సేవలో తరించారని వివరించారు. అదే విధంగా రైతులు దివాళా తీసే నిర్ణయాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఇకపై పాలు, వ్యవసాయ ఉత్పత్తులకు దిగుమతలపై సుంకాలు ఎత్తివేయటం దుర్మార్గమని అన్నారు. మోడీ విధానాలకు వ్యతిరేకంగా మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మోడీ విధానాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకు ప్రశ్నించరని నిలదీశారు. పోలవరం నిధుల కోత,ప్రత్యేక హోదాపై మొండి చేయి చూపటం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు జరిగే ప్రయత్నాలను ఈ సందర్భంగా వివరించారు. ప్రజా ప్రయోజనాలను రాష్ట్రంలోని పాలకులు పూర్తిగా విస్మరించారని అన్నారు. కేవలం తిరుపతి లడ్డూ ప్రకటనలకే పరిమితమై భక్తుల మనోభావాలతో చెలగాట మాడుతున్నారని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి టి.మధుమాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులతో పాటు వివిధ వాణిజ్య సంస్థలు సైతం ఈ సమ్మెలో స్వచ్ఛంధంగా భాగస్వాములయ్యాయని తెలిపారు. బ్రిటిష్ పరిపాలనలోనూ కార్మిక చట్టాలు అమలయ్యాయని వివరించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ రద్దు చేయటం దుర్మార్గమని అన్నారు. ఐఎన్టియుసి నాయఎకులు టికె విశేశ్వరరెడ్డి మాట్లాడుతూ మోడీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం చేయటమే లక్ష్యంగా పాలన సాగుతోందని అన్నారు. కార్మికుల 8 గంటల పని విధానం పోరాడి సాధించుకున్న హక్కు అని వివరించారు. సమ్మెకు సంపూర్ణమద్దతు తెలుపుతున్నామని అన్నారు. ఎఐటియుసి రాష్ట్ర నాయకులు కొండలరావు మాట్లాడుతూ లేబర్ కోడ్లు రద్దు చేసే వరకూ పో రాటం ఆగదని హెచ్చరించారు. లేబర్ కోడ్లలో పొందుపరిచిన కార్మిక వ్యతిరేక విధానాలను ఒకొక్కటిగా వివరించారు. ఎన్‌ఓ అసోసియేషన్ నాయకులు మాధవరావు మట్లాడుతూ రైతు ఉ ద్యమ స్ఫూర్తితో లేబర్ కోడ్లను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు, కార్మికులకు పెన్షన్ బిక్ష కాదు హక్కు అని అన్నారు. తక్షణమే సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయలని డిమాండ్ చేశారు. బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు లక్ష్మీపతి మాట్లాడుతూ మోడీ పాలనలో ప్రభుత్వ బ్యాంకింగ్ రంగం తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటుందని వివరించారు. కొత్త రిక్రూట్మెంట్లు లేకపోవటంతో విధులలో ఉన్న వారిపై పని భారం పెరుగుతోందని అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి పవన్ మాట్లాడుతూ శ్రామిక మహిళలకు గౌరవ వేతనం ఇస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని అన్నారు. కేంద్ర కార్మిక సంఘాలతో పాటు వైయస్ఆర్ టియుసి నాయకులు ఈ సమ్మెలో భాగస్వాములయ్యారని తెలిపారు. అదే విధంగా సమ్మెకు మద్దతు తెలిపిన చాంబర్ ఆఫ్ కామర్స్ వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ నిరసన ప్రదర్శనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి పవన్, ఎస్ ఎస్ మూర్తి, టి. ఎస్ ప్రకాష్, పోలిన వెంకటేశ్వరావు, వెంకటలక్ష్మి, రామలక్ష్మి , సావిత్రి , సింగ్, రామారావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె రాంబాబు, బాలేపల్లి వెంకటరమణ, మున్సిపల్ యూనియన్ నాయకులు రెడ్డిరమణ, వి కొండలరావు సప్పరమణ, సిటియు మూర్తి ఏఐటీయూసీ నాయకులు రామారావు, ఐఎఫ్టియు నాయకులు ఎ వి రమణ , జోజి,కోరడ అప్పారావు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# బరియల్ గ్రౌండ్‌కి కాంపౌండ్ వాల్ నిర్మించాలి

### క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో తీర్మానం




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక రాజమండ్రి లాలాచెరువు రోడ్లో ఉన్న శాంతి నిలయం చర్చిలో రాజమండ్రి అర్బన్ & రూరల్ క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ అడ్వయిజరీ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావే శంలో రానున్న క్రీస్తు శ్రమకాల ధ్యానములు ప్రారంభ దృష్ట్యా ప్రార్ధనలు చేశారు. రాజమండ్రి అర్బన్ & రూరల్ క్రైస్తవుల నిమిత్తం 2023లో ప్రభుత్వం మంజూరు చేసిన క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ అడ్వయిజరీ కమిటీ ప్రత్యేకమైన ప్రార్ధనలు చేశారు.ఆ బరియల్ గ్రౌండ్‌లో ఇప్పటి వరకు 1,050 సమాధులను ఏర్పాటుచేసుకోవడం జరిగిందన్నారు. అయితే బరియల్ గ్రౌండ్ చుట్టూ కాంపౌండ్ వాల్‌ను నిర్మించమని గత ప్రభుత్వానికి, ప్రస్తుతం ఉన్న ఈ ప్రభుత్వానికి సంబంధిత ప్రభుత్వ అధికారులందరికీ ఎన్నోసార్లు వినతులు పెట్టినా నేటికీ ప్రహరి గోడ నిర్మాణం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రహరీగోడ లేకపోవడం వలన చుట్టుప్రక్కల నివాస ప్రాంతాలైన రెవిన్యూ కాలనీ, టిడ్కో హౌసెస్, సావిత్రినగర్ ప్రాంత వాసులకు తీవ్రమైన అభ్యంతరాలు వస్తున్నాయన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, రాజమండ్రి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చియ్య చౌదరి, రాష్ట్ర టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఈటె స్వామి దాసులకు ఈ క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం నివేదికలు సమర్పించామన్నారు. ఫిబ్రవరి 5వ తేదీన సిఎం చంద్రబాబు నాయుడును రాష్ట్ర టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఈటె స్వామి దాసు ద్వారా అమరావతిలో కలిశామని,అతి త్వరలో కాంపౌండ్ వాల్, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని ముఖ్యమంత్రివర్యులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయంలో స్థానిక శాసనసభ్యులు గోరంట్ల బుచ్చియ్యచౌదరి తమ వంతు కృషి చేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు.ప్రతి వర్షాకాలంలో క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్లో నీటి సమస్య, బరియల్ గ్రౌండ్ చుట్టుపక్కల నివాసులందరికీ ఆటంకం లేకుండా దేవుడు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చుట్టుపక్కల ఉన్న నివాస ప్రాంతాల వారికి ఆటంకం లేకుండా ప్రహరీగోడను, ప్రహరీగోడ చుట్టూ విద్యుత్ దీపాలను ఏర్పాటుచేయాలని ఈ సమావేశంలో తీర్మానాలు చేసారు. ఈ సమావేశంలో సెక్రటరీ రెవ. బి. ఏలియా, ట్రెజరర్ బ్రదర్ కె. శాంతా రావు,జాయింట్ సెక్రటరీ రెవ.ఎన్.లాజర్, రెవ.ఎం. విజయకుమార్,రెవ వాసంశెట్టి అనంసమావేశంలో కమిటీ ప్రెసిడెంట్ బిషప్ పొన్నమాటి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ 1972 మంచి మెసేజ్ ఇచ్చిన చిత్రం

### జర్నలిస్ట్ సత్యకు భవిష్యత్తులో మంచి అవకాశాలు రావాలి
### చిత్ర యూనిట్‌కు సత్కారం : అనుశ్రీ సత్యనారాయణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బుధవారం ఘంటసాల వర్ధంతి సందర్భంగా రాజమండ్రి ప్రముఖ నటుడు ఆర్కెస్ట్రా పితామహుడు జిత్ మోహన్ మిత్ర, మిత్ర మండలి ఆధ్వర్యంలో జర్నలిస్టు,దర్శకుడు సత్య దర్శకత్వంలో వచ్చిన లఘు చిత్రం ఆపరేషన్ 1972 చిత్ర బంధాన్ని సత్కరించారు. గత నెల 30వ తేదీన తూర్పుగోదావరి జిల్లా పోలీస్ శాఖ ప్రకటించిన షార్ట్ ఫిలిం కాంపిటేషన్లో జర్నలిస్టు సత్యా దర్శకత్వం వహించి, సహదర్శకత్వం వహించిన డీఎస్ రావులకు యాంటీ డ్రగ్ వినియోగంపై విచ్ఛిన్నముతున్న జీవితాలపై తీసిన లఘు చిత్రానికి మొదటి బహుమతి లభించడంతో దానికిగాను శ్రీపాద జిత్ మోహన్ మిత్ర బృందం చిరు సత్కారం చేసింది.. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ రాజమండ్రి ఇంచార్జ్ సినీ డిస్ట్రిబ్యూటర్ అను శ్రీ అత్తిలి సత్యనారాయణ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక, జిట్ మోహన్ మిత్ర, వారి బృందం పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు దివంగత ఘంటసాల గానాలపన కార్యక్రమం జరిగింది. జనసేన ఇంచార్జ్ ఫిలిం డిస్ట్రిబ్యూటర్ అను శ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ ఆపరేషన్ 1972 లఘు చిత్రం నిజంగా చూస్తుంటే థియేటర్లో సినిమా చూసిన ఫీలింగ్ కలిగిందన్నారు.. జర్నలిస్టుగా చేస్తూ సమాజానికి మంచి మెసేజ్ ఇచ్చిన జర్నలిస్టు సత్య ఈ చిత్రాన్ని తీసి పోలీసులు ప్రశంసలు పొందడమే కాకుండా ప్రేక్షకులను కూడా ఎట్టిపడేసిన ఆపరేషన్ 1972 చిత్ర బృందాన్ని అభినందించారు.. అవకాశం ఉంటే ఫ్యూచర్లో మంచి కథతో వస్తే జర్నలిస్టు సత్యకు దర్శకత్వ బాధ్యతలతో పాటు నేను నిర్మాతగా వ్యవహరిస్తానన్నారు అను శ్రీ సత్యనారాయణ, బిజెపి కార్యవర్గ సభ్యురాలు హారిక మాట్లాడుతూ,ఆపరేషన్ 1972లో ఒక తండ్రి తన కొడుకు గంజాయి తీసుకుంటే పోలీసులను పిలిచి ఇన్ఫర్మేషన్ ఇచ్చి పట్టించడం సమాజానికి మంచి మెసేజ్ ఇచ్చిన చిత్రంగా నిలుస్తుంది అన్నారు హారిక.. జర్నలిస్ట్ సత్యకు భవిష్యత్తులో మంచి అవకాశారావాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు.లఘు చిత్రాన్ని తలకించేందుకు ఆపరేషన్ 1972 నటించిన నటినటులతో పాటు రాజమండ్రి కి చెందిన ప్రముఖ నటీనటులు హాజరై చిత్రాన్ని కలిగించారు. జర్నలిస్ట్ సత్య దర్శకత్వం వహించిన వారందరికీ అభినందనలు తెలిపారు.

# నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

### పుష్కరాలకు అధిక నిధులు ఇవ్వాలని సీఎంకు వినతిపత్రం అందజేసిన బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం అందజేసినట్లు రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. గురువారం శాసనసభ సమావేశ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి, నియోజకవర్గంలో పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. సత్యసాయి తాగునీటి పథకాన్ని పునరుద్ధరించి ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని, నరసన్న ఆలయ భూములను22(ఎ) నుండి తొలగించాలని, ఇళ్ల స్థలాలకు భూములు ఇచ్చిన రైతులకు నగదు వంటి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని చంద్రబాబుకు అందజేశారు. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించి, అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు.

# ఎమ్మెల్సీ తోటకు మాజీ మంత్రుల పరామర్శ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మాతృ వియోగంతో బాధపడుతున్న శాసనమండలి సభ్యులు తోట త్రిమూర్తులను మాజీ మంత్రులు తోట నరసింహం, కురసాల కన్నబాబు, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, సామినేని ఉదయభాను, పర్వత ప్రసాద్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ తుమ్మల బాబు, పశ్చిమగోదావరి జిల్లా డిసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు తదితరులు గురువారం రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం వెళ్లి పరామర్శించారు. తోట త్రిమూర్తులు సోదరుడు తోట సత్యనారాయణ ఇటీవల స్వర్గస్తులు అయిన విషయం విధితమే ఈ నేపథ్యంలో త్రిమూర్తులను పరామర్శించడానికి రాష్ట్రం నలుమూలల నుండి నాయకులు కార్యకర్తలు వెంకటాయపాలెం గ్రామం తరలివస్తున్నారు సోదరుని నివాసంలో తోట త్రిమూర్తులు ఉండి తనను పరామర్శించవచ్చిన కార్యకర్తలను నాయకులను, అభిమానులను కలుసుకుంటున్నరు. గురువారం తోటను పరామర్శించిన వారిలో కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసు, కాకినాడ పురపాలక సంఘం మాజీ మేయర్ సుంకర పావని, అమలాపురం వైసిపి పార్టీ ఇంచార్జ్ పినిపే శ్రీకాంత్, జక్కంపూడి గణేష్, అనపర్తి జడ్పీటీసీ వెంకట రెడ్డి, రామచంద్రాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ రిషి, మర్రెడ్డి శ్రీనివాస్, వైసీపీ నాయకులు నేమాని రాజశేఖర్, మేక శ్రీనివాస్, కాకినాడ మున్సిపల్ కార్పొరేటర్ రాజవరపు కృష్ణ తదితరులు పరామర్శించారు.

# రేషన్ డీలర్ల ప్రెసిడెంట్ వాకపల్లికి మాతృ వియోగం

### బత్తుల వెంకటలక్ష్మి పలువురు రేషన్ డీలర్ల సంతాపం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ వాకపల్లి సూరిబాబు తల్లి వాకపల్లి నారాయణమ్మ(85) ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతిచెందారు.దీంతో చిన్న కొండేపూడి గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. విషయాన్ని తెలుసుకున్న జనసేన పార్టీ నా సేనా కోసం నా వంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి సూరిబాబు నివాసానికి వెళ్లి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి ఈ సమయంలో ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే పలువురు రేషన్ డీలర్లు నారాయణమ్మ చిత్రపటాన్ని తన కుమారుడైన సూరిబాబుకు అందజేశారు. పార్టీలకతీతంగా పలువురు నాయకులు వాకపల్లి సూరిబాబు నివాసానికి చేరి ధైర్యం చెప్పారు. ధైర్యం చెప్పిన వారిలో తూర్పుగోదావరి జిల్లా డీలర్ల ప్రెసిడెంట్ బుంగ రాజు,కోరుకొండ డీలర్ల సెక్రటరీ తనకాల వెంకటరమణ,సీతానగరం మండల డీలర్ల సెక్రటరీ ముప్పిడి చంద్రశేఖర్, మండల జనసేన పార్టీ సీనియర్ నాయకుడు, సీతానగరం గ్రామ సొసైటీ చైర్పర్సన్ మట్ట వెంకటేశ్వరరావు, వలవల రాజా, పెందుర్తి అచ్చయ్య, మండల రేషన్ డీలర్లు వలవల వల్లీ, దుగ్గిరాల సీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

# విశ్వం వాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

శుక్రవారం, 13 ఫిబ్రవరి 2026

www.viswamvoice.com






# అభివృద్ధికి చిరునామా బండారు

### జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో నాలుగు రోజుల్లో రూ.సుమారు 30 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట,ఆలమూరు, రావులపాలెం, ఆత్రేయపురం, మండలాల్లో సుమారు 30 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ఈ నెల 7,8,9,10 తేదీలలో ఎమ్మెల్యే బండారు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామాల రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందనడానికి ఇదే నిదర్శనం జాతిపిత మహాత్మా గాంధీ పేర్కొన్న "పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు" అన్న మాటలను నిజం చేస్తూ గ్రామాల సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. కొత్తపేట మండలం రూ.3 కోట్ల 57 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులకుశంకు స్థాపనలు నిర్వహించారు. వాడపాలెం, కొత్తపేట, మందపల్లి, పలివెల, గంటి, ఆవిడి, బిల్లకుర్రు, వానపల్లిగ్రామాల్లో పనులు చేపట్టారు.అదనంగా రూ.1 కోటి 80 లక్షలతో బండారు పేట, మందపల్లి, గంటి, వానపల్లి-2 గ్రామాల్లో వెల్నెస్ సెంటర్ల నిర్మాణానికి ఆలమూరు మండలం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్) నిధుల ద్వారా మొత్తం రూ.3 కోట్ల 88 లక్షల వ్యయంతో 18 రహదారి సీసీ రోడ్లు మరియు డ్రైన్ పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. మడికి, జొన్నాడ, కలవచర్ల, నర్సిపూడి (2 రోడ్లు), గుమ్మిలేరు, సందిపూడి, ఆలమూరు (5 రోడ్లు), పెనికేరు, మోదుకూరు, నవాబ్‌పేట, చొప్పెల్ల, మూలస్థానం, బడుగువారిలంక గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించనున్నారు. అదేవిధంగా 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.1 కోటి 8 లక్షల వ్యయంతో సందిపూడి,మూలస్థానం-1మూలస్థానం-2 గ్రామాల్లో మూడు వెల్నెస్ సెంటర్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.ఆర్ ఉ బి నిధులతో రూ.3 కోట్ల 85 లక్షలతో పూర్తి చేసిన కొత్తూరు-నర్సిపూడి రహదారిని ప్రారంభించారు. రావులపాలెం మండలం మొత్తం రూ.3 కోట్ల 60 లక్షలతో వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మెటల్ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. దేవరపల్లి, వెదిరేశ్వరం, రావులపాడు, కొమర్రాజులంక, రావులపాలెం, ఈతకోట, పొడగట్లపల్లి, గోపాలపురం గ్రామాల్లో పనులు చేపట్టారు.రూ.2 కోట్ల 16 లక్షలతో ఈతకోట, గోపాలపురం-2, కొమర్రాజులంక, ముమ్మిడివరప్పాడు, రావులపాలెం గ్రామాల్లో 6 వెల్నెస్ సెంటర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈతకోట గ్రామంలో రూ.1 కోటి 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను ప్రారంభించారు. ఆత్రేయపురం మండలం రూ.3 కోట్ల 72 లక్షలతో రహదారులు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు, రూ.3 కోట్ల 24 లక్షలతో వెల్నెస్ సెంటర్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు నిర్వహించారు.మెర్లపాలెం, వాడపల్లి, లొల్ల, ఉచ్చిలి, వెలిచేరు, పేరవరం, బొబ్బర్లంక, వసంతవాడ, తాడిపూడి, నార్కెడ్మిల్లి, అంకంపాలెం, ర్యాలీ తదితర గ్రామాల్లో పనులు చేపట్టారు.వెలిచేరు గ్రామంలో రూ.59 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్‌ను ప్రారంభించారు. భూమిపూజ చేశారు. ప్రభుత్వ సంకల్పం గ్రామాల్లో మౌలిక వసతులు బలోపేతం చేయడం, రవాణా సౌకర్యాలు మెరుగుపరచడం, పారిశుధ్యాన్ని పెంపొందించడం, ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడం లక్ష్యంగా ఎమ్మెల్యే సత్యానంద రావు గారు పనిచేస్తున్నారు అని ముత్యాల బాబ్జి జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మాసాబత్తుల ఆనందరావు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తెలియజేశారు.

### కామన్ మ్యాన్ సేవాదళ్ సంస్థ

# సేవలకు అభినందనలు



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి కామన్ మ్యాన్ సేవాదళ్ ఆర్థిక సాయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి ఇళ్లవారి పాలెం గ్రామానికి చెందిన ఇళ్ల ధనరాజు గత కొద్ది రోజులుగా వెన్నుపూస సంబంధిత వ్యాధితో బాధపడుతూ అమలాపురం ప్రవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య చికిత్సకు అవసరమైన ఖర్చులు అధికంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు కామన్ మ్యాన్ సేవాదళ్ టీమ్‌కు తెలియజేశారు. విషయం తెలుసుకున్న కామన్ మ్యాన్ సేవాదళ్ సభ్యులు స్పందించి,ఇళ్ల ధనరాజు కి రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. సమాజంలో ఆర్థికంగా బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ కామన్ మ్యాన్ సేవాదళ్ సంస్థ చేస్తున్న సేవలను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కామన్ మ్యాన్ సేవాదళ్ వ్యవస్థాపకులు బొక్కా ప్రసాద్ సభ్యులు ముషిని వెంకట రమణ,గుత్తుల ప్రకాష్,దాకరపు నాగేంద్ర, కముజు శ్రీనివాస్,కముజు వర ప్రసాద్, ఇళ్ల పల్లంశెట్టి, కండిబోటి రాజేష్,ఇళ్ల సురేష్,ఇళ్ల రామలక్ష్మణ్, యల్లమెల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట ఏరియాలో మద్యం సేవించి వాహనములు నడుపువారికి జరిమానా

కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : మద్యం సేవించి వాహనంలో నడిపిన ఇరువురికి 10000 రూపాయల చొప్పున జరిమానా విధించారు వివరాల్లోకెళ్తే కొత్తపేటకు చెందిన పోరాటి భాస్కరరావు మరియు అంబాజీపేటకు చెందిన బైరిశెట్టి శివ అను ఇరువురు కొత్తపేట ఏరియాలో మద్యం సేవించి వాహనములు నడుపుసుండగా కొత్తపేట ఎస్సై వారి ఇరువురిని పట్టుకుని వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెట్టి కొత్తపేట స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి వద్ద హాజరు పరచగా స్పెషల్ మెజిస్ట్రేట్ అయినా కే రాంబాబు వారిరువురికి పదివేల రూపాయలు చొప్పున జరిమానా విధించినారు అని కొత్తపేట ఎస్సై జి సురేంద్ర తెలియజేసినారు.

### నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని

# విజయవంతం చేయాలి : కలెక్టర్ మహేష్



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

1 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు, యువత ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు. గురువారం నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహణ ఏర్పాట్లపై టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆరోగ్య సిబ్బందికి దిశానిర్దేశం చేసిన కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పిల్లల ఆరోగ్య భవిష్యత్తును రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. నులిపురుగులు పిల్లలలో పోషకాహార లోపం, రక్తహీనత, అలసట, చదువులో వెనుకబడటం వంటి సమస్యలకు కారణమవుతాయని ఆయన చెప్పారు. ఈ సమస్యలను నివారించేందుకు ప్రభుత్వం పాఠశాలలు, ఆంగన్‌వాడీ కేంద్రాల ద్వారా క్రిమిసంహారక మాత్రలను ఉచితంగా అందించి మింగిస్తోందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఆంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 1 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు, యువత తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని మాత్రలు తీసుకోవాలని, తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ మాత్రలు పూర్తిగా సురక్షితమైనవని, వైద్య నిపుణుల సూచనల మేరకు ఇవ్వబడతాయని స్పష్టం చేశారు. జిల్లా ఆరోగ్యవంతంగా, శక్తివంతంగా ముందుకు సాగాలంటే ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం. దుర్గారావు దొర మాట్లాడుతూ పిల్లలలో రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను నివారించడం జాతీయ నులిపురుగుల దినోత్సవం ప్రధాన లక్ష్యమని తెలిపారు. భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో రెండుసార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య, విద్యాశాఖలు, ఇతర ప్రభుత్వ విభాగాలు సంయుక్తంగా సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఫిబ్రవరి 17న నులిపురుగుల దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తేదీన మాత్రలు తీసుకోలేని పిల్లల కోసం ఫిబ్రవరి 24న మాప్-అప్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య అధికారి డాక్టర్ భారతి లక్ష్మి, ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ) డాక్టర్ ఎం. సుమలత, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో కాంగ్రెస్ నాయకుల సమావేశం

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం అమలాపురం ప్రెస్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సి డబ్ల్యూ సి) సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కేంద్ర మంత్రి జే.డి. శీలం హాజరయ్యారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం కొత్త పేర్లతో పథకాలను ప్రవేశపెడుతోందని విమర్శించారు. గాంధీ పేరును కాగితాల నుంచి, బోర్డుల నుంచి, పుస్తకాల నుంచి తొలగించవచ్చేమోగానీ, దేశ ప్రజల మనస్సుల్లో నుంచి గాంధీని ఎప్పటికీ తొలగించలేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ గాంధేయ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల కోనసీమ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, ఆ పర్యటనను విజయవంతం చేయడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. జిల్లా వ్యాప్తంగా భారీ స్థాయిలో ప్రజలను సమీకరించి, పార్టీ శక్తిని చాటాలని పిలుపునిచ్చారు. జే.డి. శీలం మాట్లాడుతూ, పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి ఇప్పటికే ప్రతి గ్రామంలో 10 నుండి 12 మందితో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడం లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరిస్తున్నాయని విమర్శిస్తూ, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, దేశంలో రాహుల్ గాంధీ నాయకత్వానికి అవకాశం కల్పిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. జిల్లాలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించి, యువత, మహిళలు, రైతులు, కార్మికులను కాంగ్రెస్ వైపు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని నాయకులకు సూచించారు. పార్టీ పాత కేడర్‌ను సమన్వయం చేసుకుంటూ, కొత్తవారికి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వంటెద్దు బాబి, చీకట్ల అబ్బాయి, అయితాబత్తుల సుభాషిణి, ముసిని రామకృష్ణారావు తదితర నాయకులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై పీసీసీ అధ్యక్షురాలి పర్యటనను విజయవంతం చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# దేశవ్యాప్తంగా కార్మిక సార్వత్రిక సమ్మెకు అమలాపురం ఎల్ఐసి ఘన మద్దతు




విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

దేశవ్యాప్తంగా నేడు నిర్వహించిన కార్మిక సార్వత్రిక సమ్మెలో భాగంగా అమలాపురం స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు సమ్మె విజయవంతంగా నిర్వహించారు. ఎల్ఐసి అమలాపురం బ్రాంచ్ మూడు, నాలుగు తరగతుల ఉద్యోగుల సంఘం, ఎల్ఐసి పెన్షనర్స్ అసోసియేషన్, సిఐటియు అనుబంధ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను 100 శాతం విజయవంతం చేశారు. అలాగే ఎల్ఐసి క్లాస్-1 ఆఫీసర్స్ అసోసియేషన్ కూడా తమ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్స్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వ రంగ సంస్థలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, ఇన్సూరెన్స్ మరియు బ్యాంకింగ్ రంగాలు పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని డిమాండ్ చేశారు. బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పెంపును వ్యతిరేకిస్తూ, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమ్మెను ఉద్దేశించి ఎల్ఐసి మూడు, నాలుగు తరగతుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.ఆర్.కె. అర్జున్, కార్యదర్శి ఏ.బి. వీరేంద్ర ప్రసంగించారు. ఎల్ఐసి పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పి. కామేశ్వరరావు, ఎం. శ్రీరాములు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా డివిజన్ నాయకుడు వీరభద్రరావు, బ్రాంచ్ అధ్యక్షుడు నాగేంద్ర కుమార్ తదితరులు కూడా సమ్మె ఉద్దేశ్యం, అవసరంపై వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ గుమ్మలూరు వినాయకరావు, ఏపీ స్టేట్ ఈసీ మెంబర్ దొమ్మేటి శివస్వామి, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కేతా వీరస్వామి, కోరుమిల్లి మధు, దంగేటి వెంకటేశ్వరరావు మరియు ఏవోఐ యూనియన్‌కు చెందిన ఏజెంట్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సమ్మె సందర్భంగా కార్మిక హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ రంగ బలపరిచే అవసరం, కార్మికులకు భద్రత కల్పించే విధానాల అమలుపై నాయకులు పునరుద్ఘాటించారు.

### మామిడికుదురు అగ్నిబాధితులకు

# అండగా ఎంపీ గంటి హరీష్ బాలయోగి

### 14 కుటుంబాలకు పూర్తి సహాయం - అధికారులకు తక్షణ ఆదేశాలు



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు గ్రామంలో సంభవించిన అగ్ని ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ప్రమాదంలో 11 ఇళ్లు పూర్తిగా దగ్ధమై 14 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ఈ ఘటనపై అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ బాలయోగి వెంటనే స్పందిస్తూ బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాల నిమిత్తం ఢిల్లీలో ఉన్నప్పటికీ, ఘటన విషయం తెలుసుకున్న వెంటనే ఎంపీ హరీష్ బాలయోగి స్థానిక కూటమి నాయకుల ద్వారా బాధిత కుటుంబాలతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదంతో తీవ్ర ఆవేదనకు గురైన కుటుంబాలకు ధైర్యం చెప్పి, మీకు నేను, ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటాం. ఎవరూ నిరాశ చెందవద్దు అని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా జిల్లా అధికారులతో కూడా ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడి, బాధితులకు తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాత్కాలిక నివాసం, ఆహారం, అవసరమైన వస్తువులు వెంటనే అందించడంతో పాటు నష్టపరిహారం విషయంలో ఎలాంటి ఆలస్యం చేయకూడదని సూచించారు. ప్రజల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందించే నాయకుడిగా పేరుగాంచిన ఎంపీ గంటి హరీష్ బాలయోగి, అగ్ని ప్రమాదం వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా దూరంలో ఉన్నప్పటికీ బాధితుల పట్ల తన బాధ్యతను నిర్వర్తించడం విశేషం. ఆయన స్పందనతో బాధిత కుటుంబాల్లో కొంత ధైర్యం నింపబడింది. బాధిత కుటుంబాలు తిరిగి సాధారణ జీవనంలోకి రావడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందుతుంది అని ఎంపీ హరీష్ బాలయోగి స్పష్టం చేశారు. ఈ ఘటనలో నష్టపోయిన కుటుంబాలకు సమగ్ర సహాయం అందేలా చర్యలు కొనసాగుతున్నాయని, ప్రజలు కూడా సహానుభూతితో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

### మందేశ్వర స్వామి, శ్రీ ఉమా బ్రహ్మేశ్వర స్వామి, శ్రీ ఉమానాగేశ్వర స్వామి వార్ల

# వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవములు



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం నందు ది.13-02-2026 శుక్రవారం నుండి ది.18-02-2026 బుధవారం వరకు శ్రీ ఉమా మందేశ్వర స్వామి, శ్రీ ఉమా బ్రహ్మేశ్వర స్వామి వారి, శ్రీ ఉమా నాగేశ్వర స్వామి వార్ల వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవములు అత్యంత వైభవంగా జరుగును. ఈ కళ్యాణ మహోత్సవములలో భాగంగా ది.13-02-2026 శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుండి 'గ్రామోత్సవం'కార్యక్రమం మేళ తాళములు, వివిధ సాంస్కృతిక కార్యక్రమముల నడుమన ఊరేగింపుగా ప్రారంభమై, అనంతరం రాత్రి 10 గంటలకు శ్రీ స్వామి వార్ల, అమ్మవార్ల దివ్య కళ్యాణంలి దేవస్థానం అర్చకులు, వేదపండితులచే అత్యంత వైభవంగా నిర్వహించబడును.ది. 14-02-2026 శనివారం శని త్రయోదశి పర్వదినం అమావాస్య ముందు వచ్చుచున్నది. అదేవిధంగా ది.15-02-2026 ఆదివారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ పర్వదినములలో యావన్మంది భక్తులు శ్రీ స్వామి వారికి తైలాభిషేకములు నిర్వహించుకొని శ్రీ స్వామి వార్లను,అమ్మవార్లను తరించి, తీర్థ ప్రసాదములు స్వీకరించవలసినదిగా కోరడమైనదని ఈ కార్యక్రమూలన్నియూ జయప్రదం చేయవలసినదిగా కోరడమైనదని దారపురెడ్డి సురేష్ బాబు, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

### సాయి మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల ప్రతిభకు

# రాష్ట్ర స్థాయిలో గుర్తింపు




విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

రాష్ట్ర స్థాయి ఓపెన్ తైక్వాండో బాలబాలికల ఛాంపియన్షిప్‌లో అమలాపురం సాయి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. ఈ విజయంతో అమలాపురం క్రీడా రంగంలో మరో మైలురాయి నమోదు అయింది. ఈ విషయాన్ని సాయి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు దేశంశెట్టి సాయిబాబు తెలిపారు. ఆదివారం పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 250 మంది బాలబాలికలు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కఠినమైన పోటీ మధ్య అమలాపురం క్రీడాకారులు అద్భుత నైపుణ్యంతో పోరాడి జట్టు విభాగంలో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. పోటీలలో పిఠాపురం జట్టు ప్రథమ స్థానం, అమలాపురం జట్టు ద్వితీయ స్థానం, వైఎస్సార్ కడప జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించాయి. విజేతలకు మాజీ ఎమ్మెల్యే వర్మ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడలపై మరింత ఆసక్తి పెంచుకుని క్రీడా కోటా ద్వారా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ విజయాలు సాధించవచ్చని అన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా జి. శివప్రసాద్, పి. కృష్ణ, పి. పవన్ వ్యవహరించి పోటీలను సమర్థవంతంగా నిర్వహించారు. అమలాపురం సాయి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థుల విజయంపై పట్టణంలోని క్రీడా ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పవర్ లిఫ్టింగ్‌లో మెరిసిన అశెట్టి ఆదిబాబు

### శ్రీదేవి ఉత్సవ కమిటీ అభినందనలు





విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, పట్టణ అభివృద్ధికి కృషి చేస్తూనే క్రీడా రంగంలోనూ ప్రతిభ చాటుతున్న ఆశెట్టి ఆదిబాబు యువతకు ఆదర్శప్రాయుడని శ్రీదేవి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంగాబత్తుల రాంబాబు అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో ఇటీవల నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బెంచ్ ప్రెస్ విభాగంలో బంగారు పతకం సాధించి అమలాపురం పేరును ప్రతిష్టాత్మకంగా నిలబెట్టిన ఆదిబాబును శ్రీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక శ్రీదేవి మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య ఆదిబాబు దంపతులకు దుశ్శాలువా కప్పి, నూతన వస్త్రాలు అందజేసి, జ్ఞాపికలు సమర్పించి గౌరవించారు. కార్యక్రమానికి హాజరైన వర్తకులు, కమిటీ సభ్యులు పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన గంగాబత్తుల రాంబాబు, ఆదిబాబు క్రీడా రంగంలో సాధించిన విజయం మాత్రమే కాకుండా, సమాజ సేవలోనూ ఆయన చూపుతున్న చురుకుదనం ప్రశంసనీయం. యువత శారీరక దృఢత్వంతో పాటు సామాజిక బాధ్యత కూడా కలిగి ఉండాలనే సందేశాన్ని ఆదిబాబు తన జీవితంతో చూపిస్తున్నారు అని పేర్కొన్నారు. ఆదిబాబు పవర్ లిఫ్టింగ్ రంగంలో నిరంతరం సాధన చేస్తూ, క్రమశిక్షణతో ముందుకు సాగుతున్నారు. ఆయన సాధించిన బంగారు పతకం వ్యక్తిగత విజయమే కాకుండా, అమలాపురం పట్టణానికి గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు. క్రీడల్లో రాణించాలంటే పట్టుదల, సాధన, ఆత్మవిశ్వాసం ఎంత ముఖ్యమో ఆదిబాబు నిరూపించారని వారు తెలిపారు. సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, అవసరమైన చోట సహాయం అందిస్తూ ఆదిబాబు ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తూ యువతను సానుకూల దిశగా నడిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సలాది గోవిందు, ఆకుల నాగేశ్వరరావు, రేపాక సత్యనారాయణ, కొండేటి వెంకటేశ్వరరావు, మామిడిపల్లి రాంబాబు, కోకా నానిబాబు, వంటెద్దు గంగాద్రి, కుప్పాల రామకృష్ణ, గంగాబత్తుల దొరబాబు, కొర్లపాటి గణేష్ తదితరులు పాల్గొని ఆదిబాబుకు అభినందనలు తెలిపారు. మొత్తంగా, క్రీడా విజయంతో పాటు సామాజిక సేవలోనూ ముందుండి నిలుస్తున్న ఆదిబాబు సన్మానం పట్టణంలో హర్షాతిరేకాన్ని కలిగించింది. యువతకు ప్రేరణగా నిలుస్తూ మరిన్ని విజయాలు సాధించాలని అందరూ ఆకాంక్షించారు.



# ముక్త కంఠంతో దేశ భవిష్యత్తు కోసం గళం ఎత్తుదాం

### ఎపిడబ్ల్యూ జేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి.లోవరాజు




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో నానాటికీ కార్మికుల హక్కులకు రక్షణ, కొత్త కార్మిక చట్టాల వల్ల ఉద్యోగ భద్రత కరువు అవుతోందని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కాకినాడ జిల్లా శాఖ ఉపాధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు బోట్ల లోవరాజు పేర్కొన్నారు. భారత దేశంలో అమలు అవుతున్న కొత్త కార్మిక చట్టాలపై శంఖవరం, రౌతులపూడి, అన్నవరం, తునిలో సిఐటియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సార్వత్రిక సమ్మె, ఆందోళన కార్యక్రమాల్లో లోవరాజు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆందోళనకారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు, వాటి అమలు వల్ల మన దేశీయ వ్యవసాయ రంగం దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు. ఇది భవిష్యత్తు కాలంలో దేశీయ ఆహార భద్రతపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని చెప్పారు. రైతు, వ్యవసాయ రంగం బాగుంటేనే దేశం ఆర్థికంగా బాగుంటుందని వివరించారు. బ్యాంకులు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ వైపు వెళ్తుంటే సామాన్యులకు ప్రభుత్వ రంగం సేవలు భారం అవుతాయిని, ప్రభుత్వ ఆస్తులు ప్రభుత్వానికి లేదా ప్రజలకే చెందాలని లోవరాజు డిమాండ్ చేశారు. ఒక రోజు మనకు కలిగే చిన్న అసౌకర్యం, రేపు కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింప వచ్చని ఆయన అన్నారు. "కార్మికుడు కన్నీరు పెడితే దేశ ప్రగతి ఆగిపోతుందని, రైతు రోడ్డున పడితే దేశానికి ఆకలి తీరదని అన్నారు. దేశ భవిష్యత్తు కోసం దేశ పౌరులు ప్రతి ఒక్కరూ కలిసి గళం ఎత్తుదామని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కాకినాడ జిల్లా శాఖ ఉపాధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు బోట్ల లోవరాజు పిలుపును ఇచ్చారు.

# తిమ్మాపురం రాజకీయాలకు పశువులు బలి

### అసహ్యించుకుంటున్న గ్రామ ప్రజానీకం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ తిమ్మాపురం గ్రామ రాజకీయాలకు నాలుగు పశువులు ఎవ్వరు చంపారో తెలియని పరిస్థితుల్లో గురువారం తెల్లవారుజామున మరణించాయి. ఈ మరణానికి కారణం బుధవారం నాడు మహాశివరాత్రి సందర్భంగా శివాలయంలో ఏర్పాటు చేసుకున్న మీటింగ్ కార్యక్రమంలో రెండు రాజకీయ వర్గాలకు జరిగిన గొడవ కారణంగా వైసీపీ నాయకులు మా పశువులకు విషం కలిపి పెట్టారు. అందువలన నా పశువుల చనిపోయాయని పశువుల యాజమాన్య కుటుంబ సభ్యులలో ఒకరైన దుర్గ మీడియా సాక్షిగా తెలిపారు. పశువులు ఎలా చనిపోయాయి అనే దానిమీద పశు వైద్యులు పశువులు తిన్న ఆహార పదార్థాలను ల్యాబ్ ట్రస్టులకు పంపడం జరిగింది. ల్యాబ్ టెస్ట్ ఆధారంగా రిపోర్టు వచ్చిన తర్వాత దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టే సమస్య లేదని, న్యాయపరంగా వాళ్లపై కేసు నమోదు చేసి కోర్టు పంపుతామని కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ, తిమ్మాపురం ఎస్సై గణేష్ తెలిపారు. గ్రామంలో గొడవలు జరగకుండా ఇరువర్గాలు శాంతియుతంగా ఉండాలని కోరరు. పశువులు మరణించిన ఘటనపై గ్రామ వైసీపీ నాయకుల మీద కంప్లైంట్ తిమ్మాపురం పిఎస్ లో ఇవ్వడం జరిగింది. మూగజీవాల మరణం వ్యవహారంపై తిమ్మాపురం గ్రామ ప్రజానికం రెండు గ్రూపు రాజకీయ పార్టీల ఓటర్లు ఈ గ్రూపు రాజకీయాలను అసహ్యించుకుంటున్నారు.

# ఘనంగా వయోవృద్ధుల పండుగ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక బోటు క్లబ్బు ఉద్యానవనంలో వయోవృద్ధుల కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా విభిన్న ప్రతిభావంతుల, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచారకులు ఏవై శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్పాదక వృద్ధాప్యం కోసం వర్క్ షాప్ నిర్వహణలో భాగంగా సంగీతం, క్రాఫ్ట్ తయారీ, పెయింటింగ్, చిత్రలేఖనం, పాటలు పాడడం, చిన్న చిన్న కథలు, నడక , కుండలు తయారీ, క్యారం బోర్డ్ తదితర పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఉత్పాదక కార్యకలాపాల వర్క్ షాప్ లో పాల్గొన్న విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసినట్లు తెలిపారు, ఇందులో భాగంగా వయోవృద్ధులకు ఉచితంగా రక్త పరీక్షలు, బీపీ, డిమెన్షియా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతనికి సహకరించిన కాకినాడ జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శి అడబాల రత్న ప్రసాద్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్ నరసరాజు, బామిరెడ్డి, సూర్యనారాయణ, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఖాతాదారుల ప్రయోజనాలకే బీమా పథకాలు

### యూనియన్ బ్యాంక్ మేనేజర్ దున్న సురేష్



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఖాతాదారుల కుటుంబానికి భీమా పథకాలు అండగా ఉంటాయని కాజులూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ దున్న సురేష్ పేర్కొన్నారు. ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయిన రెండు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి భీమా పథకం ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ఆయన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ కాజులూరు శాఖ మేనేజర్ దున్న సురేష్ మాట్లాడుతూ, ఖాతాదారుల కుటుంబ సభ్యుల భవిష్యత్తు భద్రతే భీమా పథకాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇటీవల మరణించిన అన్నమనీడి చంద్రకళ, గిడ్ల సత్యనారాయణ నామినీలైన రామారావు, గీడ్ల దుర్గాదేవి కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం అందజేశారు. అంద్రంగి గ్రామంలోని బిజినెస్ కరస్పాండెంట్ శేషారావు సమక్షంలో చెక్కులను మేనేజర్ దున్న సురేష్, గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి సుజాత, ఎంపీటీసీ సభ్యులు మట్ట సత్యనారాయణమ్మల ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఖాతాదారుడు తప్పనిసరిగా భీమా పథకాల్లో చేరాలని ఆయన సూచించారు. కుటుంబానికి ఆదరణగా నిలిచే వ్యక్తి లేకపోయినా, భీమా సాయం ఆర్థికంగా ఒక ఆధారంగా నిలుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండేటి చక్రం, సి ఎఫ్ ఎల్ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### మద్యం సేవించి వాహనం నడపడం

# చట్టరీత్యా నేరం, ప్రాణానికి ప్రమాదం

### మద్యం, గంజాయి వంటి మత్తు పధార్ధాల రవాణాకు పాల్పడితే శిక్షార్హులు : ఎస్సై షరీఫ్



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా ఇంచార్జి ఎస్పీ అమిత్ బర్ధర్, డిఎస్పీ సాయి ప్రశాంత్, సిఐ సన్యాసి నాయుడు ఆదేశాలతో గురువారం దేవీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై ఎస్సై షరీఫ్ అవగాహన కల్పించారు. తొలుత మండలంలోని మడిపల్లి ఆర్ & ఆర్ కాలనీ ప్రధాన రహదారి పై వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన వాహన పత్రాలు లేని వాహన దారులపై చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై షరీఫ్ మాట్లాడుతూ వాహనదారులు ఏ విధమైన మద్యం, గంజాయి, నాటుసారా వంటి మత్తు పధార్ధాలను, మాధక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడకూడదు అని ఆయన సూచించారు. ప్రతీ వాహన దారుడు తన ప్రాణ భద్రతను స్వయంగా కాపడుకోవాల్సిన అవసరం ఉందని, అధిక వేగం తో వాహనం నడపడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రాణానికి ప్రమాదమని, మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని, ట్రాఫిక్ సిగ్నల్స్, లైన్ డిసిప్లైన్ తప్పని సరిగా పాటించాలని ద్విచక్ర వాహన దారులకు ఆయన సూచించారు. రోడ్డు భద్రత కేవలం పోలీస్ బాధ్యత మాత్రమే కాకుండా, ప్రతీ పౌరుడి యొక్క సామాజిక బాధ్యత అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవీపట్నం పోలీస్ సిబ్బంది, వాహనదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విజయవంతమైన కార్మిక సంఘాల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె...!

### ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడిలో సమ్మె




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సెంటర్ ఆఫ్ ఇండియా ట్రేడ్ యూనియన్స్ (సిటు), ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (ఐఫా)లకు అనుబంధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ల యూనియన్, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన జాతీయ సార్వత్రిక సమ్మె విజయవంతం అయ్యింది. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల కేంద్రాల్లో స్థానికంగా సమ్మె, జన నిరసన ప్రదర్శన మానవహారాల కార్యక్రమాలను నిర్వహించారు. జాతీయ సమ్మె 17 అంశాల డిమాండ్ చార్టర్తో పాటు, ఇంకా పలు న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయా మండలాల్లోని తాహసిల్దార్లకు డిమాండ్ పత్రాలను సమర్పించారు. నాలుగు కార్మిక కోడ్లు, వాటి నియమాలను రద్దుచేయాలి. అంగన్వాడీవర్కర్లు, హెల్పర్లు, మినీలను కార్మికులుగా గుర్తించి, ట్రేడ్ యూనియన్ హక్కులను కల్పించాలి. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఐసిడిఎస్ ను సరైన మౌలిక సదుపాయాలు, మంచి నాణ్యమైన ఆహారం, సరైన ప్రీ-స్కూల్ విద్యతో సంస్థాగతంగా ఉన్నతీకరించాలి, ఈసిసిఇ హక్కు కోసం చట్టం చేయాలి, అంగన్వాడీ వర్కర్లను గ్రేడ్ 3 హెల్పర్లుగా, గ్రేడ్ 4 ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 45, 46వ ఐ.ఎల్.సి. సిఫార్సుల ప్రకారం స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు, పెన్షన్, పి.ఇ.ఇ.ఎస్.ఐ. సామాజిక భద్రతా సౌకర్యాలను అమలు చేయాలి. అంగన్వాడీలకు కనీస వేతనంగా నెలకు రూ. 26,000 దీంతోపాటు రూ. 10,000 పెన్షన్ చెల్లించాలి. ఉద్యోగాలను విరమించిన అంగన్వాడీ సిబ్బందికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చట్టం అమలు చేయాలి. ఐసిడిఎస్. సంస్థను ఏ రూపంలోనూ ప్రైవేటీకరించ కూడదు. ఎస్ఆర్ఎస్, ఇ-కెవైసి పేరుతో లబ్ధిదారులను తొలగించరాదు. డిజిటలైజేషన్ ఎఫ్.ఆర్.ఎస్. పేరుతో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులను వేధించ కూడదు. వీరికి సంబంధం లేని అదనపు పనులైన ఎన్నికల విధులు, పెన్షన్ల పంపిణీని అప్పగించరాదు. విద్యుత్ సవరణ బిల్లు 2025, విత్తన బిల్లు 2025, వికశిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్ బిల్లు 2025 లను రద్దు చేయాలి. లేబర్ కోడ్స్ రద్దు చెయ్యాలి. కార్మిక చట్టాలను పటిష్టపర్చి అమలు చేయాలి. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, అమ్మకాలను ఆపాలి. ప్రజా సంపదను కాపాడాలి. కనీస వేతనాలు చెల్లించాలి. హెచ్ఎర్ పాలసీని అమలు చేయాలి. 2 సంవత్సరాల స్త్రీ నిధి ప్రోత్సాహక బకాయిలు చెల్లించాలి. అక్రమ తొలగింపులు, రాజకీయ వేదింపులు ఆపాలి. మొబైల్స్, సిమ్ కార్డ్స్ ఇవ్వాలి. రీచార్జీలను చేయించాలి. మహిళా మార్టుల్లో పొదుపు మహిళలు పెట్టిన పెట్టుబడులను తిరిగి వారికే చెల్లించాలి. స్వావలంబన మొత్తాలను పొదుపు మహిళలకు తిరిగి చెల్లించాలి. గ్రూప్ ఇన్సూరెన్సులను అమలు చెయ్యాలంటూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను తాహసిల్దార్లకు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో అంగన్వాడీ నాయకులు గెద్దం బుల్లెమ్మ, ఏడిద ఆశాజ్యోతి, ఆశ కార్యకర్తల నాయకులు పి.మంగా, జి.నూకరత్నం, వివోఏల లీడర్స్ డి.రత్నం, టి.మణి, మధ్యాహ్న భోజనం పథకం నాయకురాలు కె.సింహాద్రి, దారాలమ్మతోపాటు ఐసిడిఎస్ ప్రాజెక్టు నుంచి శంఖవరం మండలం అంగన్వాడి కార్యకర్తలు, వారి సహాయకులు, మండల వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఆశ కార్యకర్తలు, మండల వెలుగు సంస్థ నుంచి వివోలు, ప్రభుత్వ విద్యా సంస్థల మధ్యాహ్న భోజనం పథకం సిబ్బంది పాల్గొన్నారు.

# కొంతంగి-శంఖవరం రోడ్డుకు రూ.4.07 కోట్లు మంజూరు

### ఎమ్మెల్యే సత్యప్రభ చిత్ర పటానికి క్షీరాభిషేకం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కొంతంగి పంచాయతీ పరిధిలోని శాంతి ఆశ్రమం అడ్డు రోడ్డు ముఖద్వారం (కొంతంగి జంక్షన్) నుంచి వయా శంఖవరం జగ్గంపేట మీదుగా శంఖవరం వినాయకుడు గుడి వరకూ తారు రోడ్డు నిర్మాణానికి రూ. రూ. 4.07 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ రాదారి సుమారు 5.830 కిలో మీటర్ల పొడవునా తారు రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి విడుదల చేయడానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విశేషమైన కృషి చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి 1996 నుంచీ పర్వత వంశంలోని నలుగురు ఎమ్మెల్యేల కాలంలో ప్రభుత్వ నిధులు మంజూరు, విడుదలకు ప్రజలు ఎదురుచూస్తునే ఉన్నారు. అయితే ఈ నలుగురు ఎమ్మెల్యేలు ఏం కృషి చేశారో ఏమో గానీ మొత్తానికి నిధులు మాత్రం మంజూరు కాలేదు. అయితే దీనికి భిన్నంగా ప్రస్తుత ఎన్.డి.ఏ. ప్రభుత్వంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పట్టుదలతో నిధులను మంజూరు చేయించడంలో సఫలీకృతం అయ్యారు. దీంతో కాకినాడ జిల్లా తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి బద్ది వెంకటరమణ నెల్లిపూడిలోని తన స్వగృహం వద్ద గురువారం ఉదయం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించి ఈ వివరాలను వెల్లడించారు. అనంతరం గతంలో ఎంత ప్రయత్నించినా నిధులు విడుదల కాకపోవడం, ప్రస్తుత ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాత్రం నిధులను విడుదల చేయించి నందుకు కృతజ్ఞతగా ఆమె చిత్ర పటానికి ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ విధంగా ఎమ్మెల్యే పట్ల తెలుగు దేశం పార్టీ శ్రేణులు అభిమానాన్ని ప్రకటించు కున్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ బద్ది మణి, శంఖవరం మండలం తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షుడు ఓలేటి లక్ష్మీనారాయణ, పూర్వ అధ్యక్షుడు బద్ది రామారావు, కొంతంగి కనమ్మ చెరువు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు బద్ది లోవరాజు, నెల్లిపూడి తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు పిర్ల సత్యనారాయణ, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర టి.ఎన్.ఎస్.ఎఫ్. ఆర్గనైజింగ్ సెక్రటరీ బద్ది రామకృష్ణ, మరి కొంత మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చెయ్యాలి




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కనీస వేతనం 30 వేలు ఇవ్వాలని, పాత ఉపాధి చట్టాన్ని కొనసాగించాలని రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె లో భాగంగా కాకినాడ రూరల్ మండలం లో పారిశ్రామిక ప్రాంతం, గ్రామాల్లో సమ్మె జయప్రదంగా జరిగింది. కాకినాడ రూరల్ లో ఉన్న కోరమండల్, ఏం గ్రీన్ అమోనియా, ప్యారి సుగర్ ఓఎన్జిసి రిలయన్స్ ఆదాని ఆయిల్ ఇతర ఆయిల్ కంపెనీలో స్వచ్ఛందంగా ఏ షిఫ్ట్ రద్దు చేసుకున్నారు. ఉదయం 5 గంటల నుండి కోరమండలం వద్ద సమ్మె ప్రారంభమైంది. ఎక్కువమంది కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. రిలయన్స్ యాడ్ కాంటాక్ట్ కార్మికులు సమ్మె సైరన్ మోగించారు. సర్పవరం విశాఖ డైరీ సెంటర్ నుండి వందలాది మంది కార్మికులు కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని, బిజెపి కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు నశించాలని, 8 గంటల పని విధానం కొనసాగించాలని నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ సర్పవరం సెంటర్లో మానవహారం అనంతరం బహిరంగ సభ నిర్వహించడం జరిగింది. ఈ బహిరంగ సభకు కాకినాడ రూరల్ మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా ఆధ్వర్యంలో జరిగింది. బహిరంగ సభలో ప్రజానాట్యమండలి నాయకులు డప్పు కొట్టి, పాటలు పాడి సభను ఉత్తేజపరిచారు. ఈ బహిరంగ సభలో సిఐటియు కాకినాడ జిల్లా అధ్యక్షులు దువ్వా శేష బాబ్జి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్ గోవిందరాజులు, ఏపీ పంచాయతీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి చింతపల్లి అజయ్ కుమార్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వీరవేణి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, విమల, వివో ఏ సంఘం నాయకులు గంగాభవాని మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, కనీస వేతనం 30 వేలు ఇవ్వాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 21 ఇవ్వాలని, హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాల్ని అవలంబిస్తుందని విమర్శించారు. ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా వచ్చిన ఎనిమిది గంటల పని విధానాన్ని మోడీ కూటమి ప్రభుత్వం 12 గంటలు చేయడం దారుణం అన్నారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వకుండా పని గంటలు పెంచడం ఏంటని ప్రశ్నించారు. అంగన్వాడి ఆశ మిడ్ డే మిల్ పంచాయతీ వివో ఏ కార్మికులు ఏళ్ల తరబడి పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని అన్నారు. కాకినాడ రూరల్ పారిశ్రామిక ప్రాంతంలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్నికి నిధులు పెంచాలి 200 రోజులకు పని పెంచి రోజుకి 600 రూపాయలు కూల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వమే 90 శాతం నిధులు ఇచ్చి ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించిన పని గంటల పెంపుదల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేదంటే చలో అసెంబ్లీ పిలిపిస్తామన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు రద్దు అయ్యే వరకు కార్మికులు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మె సెగతోనైనా మోడీ ప్రభుత్వం వ్యతిరేక విధానాలు మానుకోవాలి అన్నారు. పార్లమెంట్లో స్తంభించే విధంగా చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు రైతులు మహిళలు యువకులు అందరూ పాల్గొనాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు మరియు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### కుటుంబ సర్వేలు

# వేగవంతంగా పూర్తి చేయాలి

### ఇన్చార్జి ఎంపిడిఓ రాజలపూడి పద్మలత

**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండల గ్రామాలలో కొనసాగుతున్న కుటుంభ సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలని కాజులూరు మండల ఇన్చార్జి ఎంపిడిఓ రాజలపూడి పద్మలత పేర్కొన్నారు. మండలంలోని 23 సచివాలయాల పరిధిలో మొత్తం 24,234 కుటుంబాలకు సంబందించిన సర్వే నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటివరకు 12,712 సర్వేలు పూర్తయ్యాయని ఆమె తెలిపారు. మిగిలిన కుటుంబాల సర్వేలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందికి ఆమె ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఫ్యామిలీ సర్వేలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అందువల్ల ప్రతి కుటుంబ వివరాలను సమగ్రంగా నమోదు చేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. సర్వేల్లో ఎదురయ్యే సమస్యలను తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. మండల అభివృద్ధికి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు ఫ్యామిలీ సర్వేలు బలమైన ఆధారమని ఆమె తెలిపారు. స్వమిత్వ సర్వే ప్రక్రియను డిప్యూటీ ఎంపీడీవో చక్రపాణిరావు, గ్రామ వార్డు సర్వే ప్రక్రియను ముద్రగడ సత్యనారాయణమూర్తి పర్యవేక్షిస్తున్నారని ఆమె తెలిపారు.

# మహాశివరాత్రి ఉత్సవాలకు పట్టిష్ట ఏర్పాట్లు

### జిల్లా పోలీసు అధికారులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలోని వంగలపూడి గ్రామం మీదుగా పట్టిసీమ అఖండ గోదావరి మధ్యలోని భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 15 నుండి మూడు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించ బడనున్నాయి. మహాశివరాత్రి ఉత్సవాలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. దాంతో గురువారం ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీడీవో ఎం భారతి అధ్యక్షతన మండల అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తాసిల్దార్ అంకం శ్రీనివాస్, మండల వైద్యాధికారి ఏవికే చైతన్య తదితర అధికారులు కార్యాచరణ షెడ్యూల్ తయారు చేసుకున్నారు. ఈ ఉత్సవాలకు సీతానగరం మండలం మీదుగా 50వేల మంది భక్తులు తరలి వెళ్లే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పట్టిసీమ ఉత్సవాల కోసం చేసిన బాట ఏర్పాట్లను జిల్లా ఎఆర్ అడిషనల్ ఎస్పీ చెంచు రెడ్డి,డిఎస్పీ వై శ్రీకాంత్,సిఐ ఎస్ వి వి మూర్తి,ఎస్ఐ డి రామ్ కుమార్,ఎమ్మార్వో అంకం శ్రీనివాస్, ఎంపీడీవో భారతి,ఈఓపిఆర్డి మూర్తి, కూటమి నాయకులు గద్దే సురేష్,తదితర సచివాలయ సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు. ఈ క్రమంలో జరిగే అన్న సమారాధన కార్యక్రమంలో,ప్రజలు నడిచి వెళ్లే క్రమంలో తొక్కిసలాటలు చోటు చేసుకోకుండా ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ అధికారులకు జిల్లా అధికారులు సూచించారు. వైద్యశాఖ అధికారులు,అగ్నిమాపక సిబ్బందిని సమన్వయం చేసుకొని పోలీసుల పని చేయాలని జిల్లా అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ,పలు శాఖల అధికారులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రేపు జేడీ శీలం రాజమండ్రి రాక

**పీసీసీ ఏఐసిసి ఆదేశాలకు అనుగుణంగానే పని చేస్తున్నాను - జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బోడా వెంకట్**
**శ్రీనివాసరావు కొవ్వూరి నియామకం సక్రమమే - బాలేపల్లి వయసుకు తగ్గ మాటలు మాట్లాడాలి**
**అంతా కలిసి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేద్దాం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పీసీసీ ఎఐసిసి ఆదేశాలకు అనుగుణంగానే తాను పని చేస్తు న్నానని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బోడా వెంకట్ స్పష్టం చేశారు.పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్రకు రాజ మండ్రి అర్బన్ కో-ఆర్డినేటర్గా కొవ్వూరి శ్రీని వాసరావును నియమించడంలో ఎలాంటి తప్పు లేదని ఆయన చెప్పారు. ఈ నియామకానికి పీసీసీ ఆమోదం ఉందని చెప్పారు.గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బోడా వెంకట్ మాట్లాడుతూ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ తనపై అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.వై.ఎస్.షర్మిల చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర రాజమండ్రి అర్బన్ ప్రాంతంలో జరిగే సమయంలో జనసమీకరణ,పార్టీ శ్రేణులను సమన్వయం చేసే బాధ్యత కొవ్వూరి శ్రీనివాసరావు చూసుకుంటారని,అలాగే పట్నాల శ్రీనివాసరావు ఆర్గనైజింగ్ అడ్మిన్ గా వ్యవహరిస్తారని ఆయన వివరించారు.నగర అధ్యక్షుడుగా ఉన్న బాలేపల్లి మురళీధర్ మీడియా సమావేశం పెట్టడానికి సొంత ఆఫీసు లేనట్లు ఎవరిమీదో ఆధారపడుతూ ఎక్కడో పెడుతున్నారని ఆయన మండిపడ్డారు బాలేపల్లి అంటే తమకు గౌరవం ఉందని,ఇకనైనా ఆయన ఆత్మపరిశీలన చేసుకుని తమతో కలిసి రావాలని,అంతా కలిసికట్టుగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేద్దామని వెంకట్ కోరారు. కాంగ్రెస్ లో కార్యకర్తలు నాయకులు కలిసే ఉన్నారని చెప్పారు. జిల్లా అధ్యక్షుడిగా తాను ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ బాధ్యులతో మాట్లాడుతున్నానని ఆయన చెప్పారు.రేపు రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జె.డి.శీలం రాజమండ్రి వస్తున్నారని ఆయనకు వై.జంక్షన్ వద్ద స్వాగతం పలికేందుకు అంతా తరలిరావాలని బోడా వెంకట్ కోరారు.కొవ్వూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలేపల్లి మాట్లాడిన తీరు సరికాదని హితవు పలికారు. నగర కాంగ్రెస్ కు సొంత ఆఫీసు కూడా లేదన్నారు. కార్యకర్తలు ఎవరి సొంత మనుషులు కాదని,వారంతా కాంగ్రెస్ కార్యకర్తలని ఆయన అన్నారు.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బోడా వెంకట్ కు జిల్లాలో కాంగ్రెస్ ను బలోపేతం చేసే సామర్థ్యం ఉందని చెప్పారు.జేడీ శీలం పర్యటన విజయవంతం చేయాలని కొవ్వూరి శ్రీనివాసరావు కోరారు.పట్నాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కొందరు కాంగ్రెస్ నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు.ఎన్.ఎస్.యు.ఐ నుంచి కాంగ్రెస్ లో ఉన్న బోడా వెంకట్ జిల్లా కాంగ్రెస్ ను బలోపేతం చేయగలరని పట్నాల శ్రీనివాసరావు చెప్పారు.విలేకరుల సమావేశంలో జేష్ట సతీష్ బాబు,మహమ్మద్,లీలావతి,కాటం రవి,వీరభద్రయ్య,గత కార్పొరేషన్ ఎన్నికల్లో 36 వ వార్డు కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థి కరగాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాడతాం..

**లేబర్ కోడ్ లు కాదు కార్మికుల పాలిట గొడ్డలి పెట్టు.. - నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి**
**వాసంశెట్టి గంగాధర్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో కార్మిక వ్యతి రేక విధానాలకు పాల్పడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్ది దింపే వరకు పోరాటం చేస్తామని ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు మాజీ కార్పొరేటర్ వాసంశెట్టి గంగాధరరావు స్పష్టం చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా వాసంశెట్టి ఆధ్వర్యంలో స్థానిక కోట గుమ్మం శివుడి బొమ్మ వద్ద ఐ ఎన్ టి యు సి అనుబంధ కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో గురువారం భారీ ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కనీస వేతన చట్టం అమలు చేయాలని కార్మి కులకు రక్షణ కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి మాట్లాడుతూ మోడీ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్ సంస్థలకు తొత్తుగా మారి కార్మికులను ఇబ్బందులు గురిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు 1926లో పోరాడి అమ ల్లోకి తెచ్చుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చడం దారుణమని ధ్వజమెత్తారు. ఎనిమిది గంటల పని విధానాన్ని పక్కనపెట్టి 10 గంటలు 12 గంటలకు మార్చి కార్మికులను శ్రమదోపిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా 12 లక్షల కోట్ల రుణమాఫీ చేసి వారికి అండగా నిలబడిన మోడీ కార్మికులపై ఎందుకు కక్ష కట్టారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 30 కోట్ల మంది కార్మికులు సార్వత్రిక సమ్మెలో భాగంగా రోడ్డు ఎక్కి ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం తక్షణం నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలు పాలన సాగించలేవని ఇప్పుడు కూడా దేశంలో అదే పరిస్థితి ఉత్పన్నమవడం ఖాయమని హెచ్చరించారు. ఐ ఎన్ టి యు సి రాష్ట్ర కార్యదర్శి టి. నారాయణరావు, ఆటో వర్కర్స్ యూనియన్, క్వారీ లారీ వర్కర్స్ యూనియన్, సదరన్ డ్రగ్స్ యూనియన్, కడియం కోస్టల్ పేపర్స్ యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ఇచ్చిన

# పింఛన్లు తొలగించే చర్యలు మానుకోవాలి

**బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి - దివ్యాంగుల పట్ల ప్రభుత్వం వివక్షత తగదు**
**వైసిపి దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు దుర్గారెడ్డి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు పులిపాటి దుర్గారెడ్డి డిమాండ్ చేశారు. బొమ్మూరులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు ముత్యాల పోశికుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశంలో దుర్గారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు దివ్యాంగులు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చాక కొత్త పింఛన్లు అందించకపోగా పింఛన్లు రీ వెరిఫికేషన్ పేరుతో పెద్దఎత్తున దివ్యాంగ పింఛన్లను తొలగించే ప్రయత్నం చేశారని, సదరం సర్టిఫికెట్లు మంజూరులో గతంలో 90శాతం వికలాంగత ఇస్తే ప్రస్తుతం వికలాంగత శాతాన్ని బాగా తగ్గించి ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేసి, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు దుర్గా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంపదను సృష్టిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దివ్యాంగుల పింఛన్లు తగ్గించడం ద్వారా సంపదను పెంచే ప్రయత్నం చేస్తున్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు 8లక్షల దివ్యాంగ పింఛన్లు ఉండగా అందులో లక్షా 70వేల మంది దివ్యాంగ పింఛన్ దారులకు ప్రభుత్వం నోటీసులు ఇచ్చిందన్నారు. ఈ అంశంపై వైఎస్సార్ కాంగ్రెస్ పోరాటం చేయడంతో వెనక్కి తగ్గిందన్నారు. అయితే ప్రస్తుతం పింఛన్లు రివిజన్ ద్వారా వికలాంగత తక్కువ ఉన్న వారి పింఛన్లు తొలగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సదరం సర్టిఫికెట్‌లలో గతంలో 90శాతం వికలాంగత ఇచ్చిన వారికి ఇప్పుడు తగ్గించి సర్టిఫికెట్లు ఇవ్వడం దారుణం అన్నారు. వికలాంగత అనేది వయస్సు పెరిగినకొద్దీ పెరుగుతుంది తప్పా తగ్గదని స్పష్టం చేశారు. డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 7 హామీలు ఇచ్చారని వాటిని అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, అంధత్వం కోటాలో అభ్యర్థులు లేకపోతే ఇతర దివ్యాంగతను అర్హతగా తీసుకొని భర్తీ చేయాలని అంతే తప్ప జనరల్‌గా పరిగణించరాదని కోరారు. రాష్ట్రంలో దివ్యాంగుల పట్ల ప్రభుత్వం వివక్షత ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగం అమలు జరుగుతుందన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి, అరెస్ట్‌లు చేసి ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. వికలాంగులకు వైఎస్సార్ కాంగ్రెస్ దివ్యాంగుల విభాగం అండగా ఉండి వారి సమస్యలపై పోరాడుతుందని, ఎవరు తమ పింఛన్లు పోతాయని భయపడవద్దన్నారు. ఈ ప్రభుత్వం దుర్మార్గంగా ఎవరి పింఛన్లు అయినా తొలగిస్తే రానున్నది జగనన్న ప్రభుత్వమే అని ఆ ప్రభుత్వంలో తిరిగి పింఛన్లు పునరుద్ధరిస్తామన్నారు. మన హక్కుల కోసం సంఘటితంగా పోరాడదామని పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు ముత్యాల పోశికుమార్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత దివ్యాంగులకు ఒక్క కొత్త పింఛను కూడా మంజూరు చేయలేదన్నారు. పైగా అనపర్తి వంటి నియోజకవర్గంలో స్వయంగా ఎమ్మెల్యేనే దివ్యాంగుడి పింఛను తొలగించాలని లేఖరాయడం అనేది చాలా దుర్మార్గం అన్నారు. దివ్యాంగుల పట్ల కక్షసాధింపు ధోరణి విడనాడాలన్నారు. మానసిక వికలాంగ విషయంలో పర్సంటేజీ చాలా తక్కువగా ఇస్తున్నారని, అక్కడ జరుగుతున్న లోపాలను సరిదిద్దాలన్నారు. మానసిక వికలాంగుల వల్ల ఆయా కుటుంబాలు పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి పింఛను మంజూరు అయ్యే విధంగా వికలాంగత శాతాన్ని నమోదు చేయాలని కోరారు. వికలాంగుల పట్ల కొంత దయతో వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల నాగేంద్ర, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు కొణతం చంద్రశేఖర్ రెడ్డి,స్థానిక నాయకులు రజనీరావు, దివ్యాంగుల హక్కుల వేదిక గౌరవాధ్యక్షులు ముద్దాల అను,బేబీరావు, మణి, కోలాటి నాగరాజు, నాగేశ్వరావు, జోజిబాబు, పరశు రాం,సానబోయిన దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తోటకు వైసిపి ముస్లిం మైనార్టీ నాయకుల పరామర్శ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోదరుడు తోట సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. మండపేట వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు గురువారం తోట స్వగ్రహం వెంకటాయ పాలెం వెళ్లి ఆయన్ని పరామర్శించారు. దివంగత తోట సత్యనారాయణ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ పరామర్శలో వైసిపి ముస్లిం మైనార్టీ విభాగం మండపేట నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ వలి సాహెబ్, పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ గౌస్, వైసిపి మైనార్టీ సెల్ నాయకులు సహస్తే హుస్సేన్, ఎండి మస్తాన్, హెచ్ ఎం టి అల్తాఫ్, షేక్ సర్కార్, షేక్ ఇమాం సాహెబ్, అమీర్ జాదా, అర్షద్ తదితరులు పరామర్శించారు.

# ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్ల డిమాండ్లు నెరవేర్చాలి : అన్నపూర్ణ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని సంఘ నాయకురాలు రామలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్లు సకల జనుల సమ్మె నిర్వహించినట్లు జిల్లా నాయకురాలు అన్నపూర్ణ తెలిపారు. గురువారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు అంగన్వాడి వర్కర్లు తమ డిమాండ్ల నెరవేర్చాలని నినాదాలు చేస్తూ, ర్యాలీ చేశారు.కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, అంగన్వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని,సూపర్వైజర్ పోస్టులు భర్తీ చేసి, గ్రాడ్యుటీ అమలు చేయాలని, కేంద్రప్రభుత్వం ఐసిడిఎస్ నిధులు తక్కువ కేటాయించిందని, అంగన్వాడీల వేతన ఊసే లేదని,2018లో వేతనాలు పెంచుతామని పీఎం మోడీ ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరుతూ తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వంలో 42 రోజులు చేసిన సమ్మె, మినిట్స్ కాపీలో వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. అనంతరం తమ డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని తాసిల్దార్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మీ,ప్రాజెక్ట్ లీడర్ సిహెచ్ అన్నపూర్ణ,ఈ రామలక్ష్మి, టిఎల్ పి వి కుమారి, అజూబా, పావని, అంగన్వాడి హెల్పర్లు, అనుబంధ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ గ్రామాలలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం : నటరాజన్



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ సబ్ స్టేషన్ పరిధిలో గల 33/11 కేవీ కోరుకొండ వీనాఫీడర్ కు కొత్త లైన్ ఏర్పాటు నిమిత్తం సరఫరాకు అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ విద్యుత్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజన్ తెలిపారు.శుక్రవారం కోరుకొండ నరసింహస్వామి ఫీడర్, 33కెవి కొత్త విద్యుత్ లైన్ నిమిత్తం, ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. మండలంలోని కోరుకొండ,ఫిలింనగర్,పశ్చిమ గోనగూడెం, జంబుపట్నం,కాపవరం, ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన రూరల్ సీఐ దొర రాజు



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలం ఏడిద శ్రీ సంగమేశ్వర స్వామి వారి ఆలయం నిర్వహించే శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను రూరల్ సిఐ దొర రాజు గురువారం పరిశీలించారు. మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు సౌకర్యవంత మైన ఏర్పాట్లు కల్పించేందుకు ఆలయ కమిటీ సంబంధిత శాఖలతో సిఐ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్నాన ఘాట్లు పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రూరల్ సిఐ దొరరాజు పేర్కొన్నారు.

### చోరీని చాకచక్యంగా చేధించి

# 14 లక్షల బంగారం రికవరీ : డీఎస్పీ శ్రీకాంత్


**ఇద్దరు ముద్దాయిలు అరెస్టు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ పోలీసులు శ్రీరంగపట్నం సర్పంచ్ మద్దాల పెద్దమ్మజీ రమణ ఇంట్లో జరిగిన చోరీలో 24 గంటలలోపే ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసి 14 లక్షల రూపాయల (92 గ్రాముల) బంగారాన్ని రికవరీ చేసినందుకు జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ పోలీస్ సిబ్బందిని అభినందించినట్లు రాజమహేంద్రవరం ఉత్తర మండల డిఎస్పి వై శ్రీకాంత్ తెలిపారు. గురువారం కోరుకొండ పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్వీవిఎస్ మూర్తి ఆధ్వర్యంలో డిఎస్పి శ్రీకాంత్ మాట్లాడుతూ శ్రీరంగపట్నం సర్పంచ్ మద్దాల పెద్దమ్మాజీ రమణ ఇంట్లో చోరీ జరిగినట్లు ఫిర్యాదు చేసిన 24 గంటల్లోనే, సీసీ కెమెరాల ఆధారంగా అదే గ్రామానికి చెందిన శరకణం జగత్ కొండలరావు, దండు అనిల్ కుమార్ ముద్దాయిలుగా గుర్తించామన్నారు. వారిని అరెస్టు చేసి 92 గ్రాముల బంగారం( సుమారు 14 లక్షల రూపాయలు), లక్ష రూపాయల నగదు రికవరీ చేసి, కోర్టుకు అందజేస్తామన్నారు. ముద్దాయిలను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఇళ్ల, దేవాలయాలు, ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందిని శ్రీకాంత్ మరోసారి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్వీవిఎస్ మూర్తి, ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### సీతానగరం మండలంలో పలు కుటుంబాలకు

# సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలంలో పలు గ్రామాలకు చెందిన పలువురికి శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జనసేన పార్టీ నా సేవ కోసం నా వంతు రాష్ట్ర కు ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. నాగంపల్లి గ్రామానికి చెందిన చింతాల వెంకట్రావుకు రూ 35,786/లు, సీతానగరం గ్రామానికి చెందిన కొండమీద శ్రీనుకు రూ.217, 290/ లు, మాగాపు శ్రీనివాస్ కు రూ.30,000/లు, మట్ట మణి సాయి దుర్గకు 31, 218/ లు, మేడిశెట్టి మంగాదేవికి రూ 29,461/లు, మద్దాల కొండలరావుకు రూ. 37,100/లు, పెంట దుర్గ సుబ్రహ్మణ్యం కు రూ.18,732/లు, ఎల్ వి పి ఎస్ ఎస్ సుబ్బారావుకు రూ.26,084/లు, వీరమళ్ళ చిట్టెమ్మకు రూ.20000/లు, పుట్టా శివరాంకు రూ 35,000/లు, పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన షేక్ మీరా వలి రూ. 32,541/లు, చెరుకూరి చిన వీర్రాజుకు రూ.35,000/లు, పుట్టా సత్యవతికి రూ. 23,920/లు, వంగలపూడి గ్రామానికి చెందిన ఉప్పులూరి శ్రీరామ్ చంద్ కు రూ.24,883/లు, కూచిపూడి రామకృష్ణ కు రూ.61,779/- లు చెక్కులను వారి ఇంటికి వెళ్ళి బత్తుల వెంకటలక్ష్మి స్వయంగా అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం, బిజెపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం రైతులకు

# నష్టపరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం కోసం 2016లో భూములు ఇచ్చిన సుమారు వందమంది రైతులకు నష్టపరిహారం ఇంకా అందాల్సి ఉందని వెంటనే చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రికి బత్తుల బలరామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

పుత్తడి బొమ్మ..! చీర కట్టులో కట్టిపడేస్తున్న

# కన్నడ భామ రుక్మిణి వసంత్

కన్నడ ఇండస్ట్రీలో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది ముద్దుగుమ్మ రుక్మిణి వసంత్. సప్తసముద్రాల దాటి అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది ఈ అందాల ముద్దుగుమ్మ. ఈ సినిమా కన్నడలో తెరకెక్కినప్పటికీ తెలుగులోకి డబ్ అయ్యింది. సప్త సాగరాలు దాటి సినిమాతో మంచి క్రేజ్ సంపాదించుకుంది. కన్నడ ఇండస్ట్రీలో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది ముద్దుగుమ్మ రుక్మిణి వసంత్. సప్తసముద్రాల దాటి అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది ఈ అందాల ముద్దుగుమ్మ. ఈ సినిమా కన్నడలో తెరకెక్కినప్పటికీ తెలుగులోకి డబ్ అయ్యింది. సప్త సాగరాలు దాటి సినిమాతో మంచి క్రేజ్ సంపాదించుకుంది. కన్నడలో వరుస సినిమాల్లో నటించిన ఈ బ్యూటీకి ఇప్పుడు తెలుగులో అవకాశాలు క్యూ కట్టాయి. ఒక్క సినిమాతోనే తెలుగువారి హృదయాలు గెలుచుకుంది ఈ అందాల భామ. నిఖిల్ సరసన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో మూవీతో తెలుగు తెరకు పరిచమయ్యింది. ఈ సినిమా సైలెంట్ గా వచ్చి వెళ్లిపోయింది. ఈ సినిమాతో రుక్మిణికి అంతగా గుర్తింపు రాలేదు. ప్రస్తుతం ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబోలో వస్తున్న డ్రాగన్ (ప్రచారంలో ఉన్న టైటిల్ పేరు)లో నటిస్తుందని టాక్. అలాగే ఇటీవలే కన్నడలో కాంతారా 1లో నటించింది. రిషబ్ శెట్టి హీరోగా నటించిన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో తన అందంతో పాటు నటనతో కవ్వించింది. దాంతో ఒక్కసారిగా స్టార్ డమ్ సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఎన్టీఆర్ సినిమాతో పాటు మరో తెలుగు సినిమాలోనూ ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. అలాగే సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది రుక్మిణి వసంత్.



సినీ వాయిస్ CINEMA

రాజా సాబ్ బ్యూటీ

## రిద్ధి కుమార్ అదరగొట్టిందిగా..!



రిద్ధి కుమార్.. లవర్ సినిమాతో చలన చిత్ర అరంగేట్రం చేసింది. రాజ్ తరుణ్ సరసన కథానాయకిగా ఈ మూవీలో అందం, అభినయంతో కట్టిపడేసింది. చాలా కాలం గ్యాప్ తీసుకున్న తర్వాత ప్రభాస్ నటించిన రాధేశ్యామ్ సినిమాలో కీలకపాత్రలో కనిపించింది రిద్ధి. రిద్ధి కుమార్.. లవర్ సినిమాతో చలన చిత్ర అరంగేట్రం చేసింది. రాజ్ తరుణ్ సరసన కథానాయకిగా ఈ మూవీలో అందం, అభినయంతో కట్టిపడేసింది. చాలా కాలం గ్యాప్ తీసుకున్న తర్వాత ప్రభాస్ నటించిన రాధేశ్యామ్ సినిమాలో కీలకపాత్రలో కనిపించింది రిద్ధి. రాధేశ్యామ్ సినిమాలో ఒక చిన్న పాత్రలు తళుక్కున మెరిసింది ఈ ముద్దుగుమ్మ. ఇందులో అర్చరీ ప్లేయర్ గా కనిపించింది. ఆతర్వాత రీసెంట్ గా రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన రాజా సాబ్ సినిమాలో కనిపించి అలరించింది. ఈ బ్యూటీ హిందీ, మరాఠీ, మళయాళ ఇలా చాలా భాషల్లో వెబ్ సిరీస్‌లలో నటించి మెప్పించింది. అంతే కాకుండా పలు సినిమాల్లో కీలక పాత్రల్లో కూడా నటించి మెప్పించింది. తన అందంతో నటనతో ఎంతో మంది అభిమానుల మనసు దోచుకుంది. రాజా సాబ్ సినిమాలో తన అందాలతో మెప్పించింది ఈ అమ్మడు. ఈ సినిమా మిక్స్ టాక్ సొంతం చేసింది. దాంతో ఈ ముద్దుగుమ్మ ఆశలు అడియాశలయ్యాయి. రాజా సాబ్ సినిమా విజయం సాధించి ఉంటే ఈ అమ్మడు తెలుగులో స్టార్ డమ్ సొంతం చేసుకునేది. కానీ రాజా సాబ్ డివైడ్ టాక్ తెచ్చుకోవడంతో రిద్ధి కుమార్ ఆశలపై నీళ్లు చల్లినట్టైంది. ఇక సోషల్ మీడియాలో ఈ అమ్మడు తన ఫొటోలతో కవ్విస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు నెటిజన్స్ కు మతిపోగొడుతోంది.

క్రీడా వాయిస్

## సింహాన్ని అడవిలో కొడితేనే కిక్కబ్బా..

రాసిపెట్టుకోండి.! అప్పుడు టీ20 ప్రపంచకప్ మనదే..



భారత్‌ను దాటకుండా ఈ ప్రపంచకప్‌ను ఎవరూ గెలవలేరని సామీ తేల్చి చెప్పాడు. 2016లో వెస్టిండీస్ టీ20 ప్రపంచకప్ టైటిల్ గెలిచినప్పుడు కూడా సెమీఫైనల్‌లో భారత్‌ను ఓడించాల్సి వచ్చిందని సామీ గుర్తు చేసుకున్నాడు. అప్పట్లో తాను కెప్టెన్‌గా వ్యవహరించగా, ఇప్పుడు కోచ్‌గా.. ఆ వివరాలు ఇలా.. వెస్టిండీస్ మాజీ కెప్టెన్, కోచ్ డారెన్ సామీ సంచలన వ్యాఖ్యలు చేశాడు. టీ20 ప్రపంచకప్ టైటిల్ గెలవాలనుకునే ఏ జట్టు అయినా ముందుగా ఆతిథ్య భారత్‌ను ఓడించాల్సిందేనని అతడు స్పష్టం చేశాడు. 2016లో భారత్‌ను ఓడించి వెస్టిండీస్ టైటిల్ గెలిచిందని గుర్తు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. వెస్టిండీస్‌కు రెండుసార్లు టీ20 ప్రపంచకప్‌ను అందించిన మాజీ కెప్టెన్, ప్రస్తుత కోచ్ డారెన్ సామీ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈసారి టీ20 ప్రపంచకప్ టైటిల్ గెలవాలని ఆశించే ఏ జట్టు అయినా ముందుగా ఆతిథ్య భారత్‌ను ఓడించాల్సిందేనని అతడు స్పష్టం చేశాడు. భారత్‌ను దాటకుండా ఈ ప్రపంచకప్‌ను ఎవరూ గెలవలేరని సామీ తేల్చి చెప్పాడు. 2016లో వెస్టిండీస్ టీ20 ప్రపంచకప్ టైటిల్ గెలిచినప్పుడు కూడా సెమీఫైనల్‌లో భారత్‌ను ఓడించాల్సి వచ్చిందని సామీ గుర్తు చేసుకున్నాడు. అప్పట్లో తాను కెప్టెన్‌గా వ్యవహరించగా, ఇప్పుడు కోచ్‌గా ఉన్నప్పటికీ భారత్‌ను ఓడించాలనే నమ్మకం మారలేదని అతడు పేర్కొన్నాడు. అయితే ప్రస్తుతం భారత్ ఆడుతున్న దూకుడును పరిగణనలోకి తీసుకుంటే ఈ సవాల్ మరింత పెద్దదిగా కనిపిస్తోందని డారెన్ సామీ అభిప్రాయపడ్డాడు. కాగా, వెస్టిండిస్ జట్టు ఇప్పటికే ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ రెండింటిలోనూ గెలిచి.. గ్రూప్ సీలో నాలుగు పాయింట్లతో టాప్ ప్లేస్‌లో కొనసాగుతోంది.

6,6,6,6,6..

## 20 బంతుల్లో ఛోటా ప్యాకెట్ బీభత్సం..

ఏకంగా 254 స్ట్రైక్ రేట్‌తో ఉతికారేసిన ఇషాన్



నమీబియాపై టాస్ ఓడి బ్యాటింగ్ చేస్తోన్న భారత జట్టు ప్రస్తుతం 3వికెట్లు కోల్పోయింది. 11. 3 ఓవర్లలో 124 పరుగులు చేసింది. ఇషాక్ కిషన్ హాఫ్ సెంచరీతో చెలరేగిపోయాడు. దీంతో పవర్ ప్లేలో భారత జట్టు భారీ స్కోర్ చేసింది. టాస్ ఓడిపోయి బ్యాటింగ్ ప్రారంభించిన భారత్, తొలి ఆరు ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 86 పరుగులు చేసింది. తుఫాన్ ఆరంభంతో నమీబియాపై చెలరేగిపోయారు టీమిండియా బ్యాటర్లు. ఈ క్రమంలో ఇషాన్ కిషన్ మరోసారి తన బ్యాట్ ఝులిపించాడు. కేవలం 20 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఇందులో 5 సిక్స్‌లు, 6 ఫోర్లు ఉన్నాయి. ధాటిగే ఆడే క్రమంలో ఓ భారీ షాక్ ఆడబోయి 61 పరుగులకు పెవిలియన్ చేరాడు. పవర్ ప్లే చివరి ఓవర్లో ఇషాన్ వరుసగా నాలుగు సిక్సర్లు, ఒక ఫోర్ కొట్టి తన అర్ధ సెంచరీని చేరుకున్నాడు. శాంసన్ 22 పరుగుల వద్ద ఔటయ్యాడు. ఈ క్రమంలో ఇషాన్‌తోపాటు టీమిండియా పేరిట కొన్ని రికార్డులు నమోదయ్యాయి. అవేంటో ఓసారి చూద్దాం.. టీ20 ప్రపంచకప్‌లో భారతదేశం తరపున అత్యంత వేగవంతమైన హాఆఫ్సెంచరీలు (బంతుల ఆధారంగా). 12 - యువరాజ్ సింగ్ vs ఇంగ్లండ్, డర్బన్, 2007, 18 - కేఎల్ రాహుల్ vs స్కాంట్లాండ్, దుబాయ్, 2021, 19 - రోహిత్ శర్మ vs ఆస్ట్రేలియా, 2024, 20 - యువరాజ్ సింగ్ vs ఆస్ట్రేలియా, డర్బన్, 2007, 20 - ఇషాన్ కిషన్ vs NAM, ఢిల్లీ, 2026, టీ20 ప్రపంచకప్ పవర్‌ప్లేలో భారతదేశం తరపున 50 పరుగులు.., 51(21) - రోహిత్ శర్మ vs ఆస్ట్రేలియా, గ్రోస్ ఐలెట్, 2024, 50(19) - కేఎల్ రాహుల్ vs స్కాంట్లాండ్, దుబాయ్, 2021, 50(20) - ఇషాన్ కిషన్ vs నమీబియా, ఢిల్లీ, 2026, టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక పవర్‌ప్లే స్కోర్‌లు.., 92/1 - WI vs AF+, గ్రోస్ ఐలెట్, 2024, 91/1 - NED vs IRE, సిల్హెట్, 2014, 89/3 - ENG vs SA, ముంబై ఔా, 2016, 86/1 - IND vs NAM, ఢిల్లీ, 2026, టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు అత్యధిక పవర్‌ప్లే స్కోర్లు.., 95/1 vs ENG, ముంబై, 2025, 94/2 vs NZ, గౌహతి, 2026, 86/1 vs NAM, ఢిల్లీ, 2026 టీ20 ప్రపంచకప్, 82/2 vs SCOT, దుబాయ్, 2021 టీ20 ప్రపంచకప్, 82/1 vs BAN, హైదరాబాద్, 2024, టీ20 ప్రపంచకప్‌లో భారతదేశం తరపున 1-6 ఓవర్లలో 50 పరుగులు.. అభిషేక్ శర్మ (మూడు సార్లు), రోహిత్ శర్మ (రెండు సార్లు), ఇషాన్ కిషన్ (రెండు సార్లు), కేఎల్ రాహుల్ (ఒక్కసారి), యశస్వి జైస్వాల్ (ఒక్కసారి).

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com